జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 22 పక్షపత్రిక నవంబర్ 16-30, 2015



## అధికార, అభివృద్ధి వికేంద్రీకరణకు పోరాడతాం

### అనంతపురంలో లోక్‌సత్తా పార్టీ 9వ వార్షికోత్సవం



26th Nov
"Constitution Day"
National Celebrations





# యువతీ
# యువకులారా!

"మంచి చదువును అందరికీ అందించే
కొత్త రాజకీయానికే మద్దతివ్వండి,
నచ్చితే పెద్దలకు నచ్చచెప్పి కులాంతర
వివాహం చేసుకోండి,
ఒక్కతరం కాలంలో సమాజం
కుల సంకెళ్లను తెంచండి."

- డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...
# లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక  నవంబర్ 16-30 2015
సంపుటి - 6  సంచిక - 22

## లోపలి పేజీల్లో...

అధికార, అభివృద్ధి వికేంద్రీకరణ కోసం పోరాడతాం ....5
అభివృద్ధి. మంచి భవిష్యత్తు కోసం బీహార్ తీర్పు.........8
ఇలాగైతే దక్షిణాదిలో మోదీకి మరీ కష్టం......................9
కమల్ ఈ డైలాగ్ చెప్పలేకపోయారు......................... 14
గాంధీ అంటే సృజనాత్మక ప్రజాసేవ తప్ప విగ్రహాలు ...... 15
పెరుగుతున్న అధికార కేంద్రీకరణ దిగజారుతున్న ........ 16
మన రాజ్యాంగం స్ఫూర్తి అత్యాధునికం ...................... 18
కావాలిప్పుడు కాలానుగుణ మార్పు............................ 22
విద్యార్థి సత్తా పునరుద్ధరణ చారిత్రక అవసరం............ 25
తెలుగు ప్రజల నోట్లో చంద్రబాబు - మోదీల ............... 27
మార్కెట్ యార్డులను రైతులకు అప్పజెప్పాలి: జేపీ....... 29
రూ.50,000 కోట్ల స్కీము స్కాంగా మారకుండా........ 30
సహచట్టంతో గ్రేటర్ హైదరాబాద్ నిధుల.................... 31
పారిస్ శిఖరాగ్ర సదస్సులో భారత్............................ 32

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆలిమిల్లి

# ప్రధాని మోదీ చేపట్టాల్సిన 8 కీలకాంశాలు



బీహార్ అసెంబ్లీ ఓటమిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక అవకాశంగా మలచుకోవాలి. రాష్ట్రాల్లో ఎన్నికల కోసం పనిచేసే ధోరణికి స్వస్తి చెప్పి 2014 ఎన్నికలలో తాను ఇచ్చిన హామీలు, చూపిన లక్ష్యాల మీద ఇకనైనా ఆయన దృష్టి పెట్టాలి. ఇప్పటికే విలువైన సమయం వృధా అయింది. ఉన్న సమయాన్నయినా సద్వినియోగం చేసుకునేందుకు మోదీ జాతి సేవకునిగా, నిజమైన నాయకుడిలా వినమ్రంగా ముందుకు రావాలి. తక్షణం చేపట్టాల్సిన 8 జాతీయ స్థాయి ప్రాధాన్యత గల కీలకాంశాలను లోక్‌సత్తా ప్రధాని ముందు ఉంచుతోంది.

1. పాఠశాల విద్య సంస్కరణలు – ప్రతి బిడ్డకీ మంచి ప్రమాణాల విద్య
2. అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం – జేబులో నుంచి ఖర్చు లేకుండా
3. స్థానిక ప్రభుత్వాలకు నేరుగా తలసరి నిధుల కేటాయింపు. ఉదాహరణకు ఏటా రూ. 1000–2000 పంచాయతీలు, మునిసిపల్ వార్డు స్థాయికి
4. పరిశ్రమల స్థాపనకి, పెట్టుబడులకి అవరోధాలని, జాప్యాన్ని తొలగించటం
5. వ్యవసాయాన్ని పరిరక్షించటం
   - ఎ. ప్రజాపంపిణీ వ్యవస్థ స్థానంలో అవినీతికి ఆస్కారంలేని ప్రభావశీలమైన ఆహార భద్రత
   - బి. పప్పుదినుసులు, వంటనూనె గింజలపై దిగుమతి సుంకాలు – ఆ పంటల రైతులకి ప్రోత్సాహకాలు
   - సి. వ్యవసాయ వ్యర్థాలను పరిష్కరించటం, ప్రాసెసింగ్ ద్వారా అదనపు విలువ చేకూర్చటం
   - డి. రిటైల్ చెయిన్ల ద్వారా దళారీలని తొలగించటం
6. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా ప్రజలకు హక్కుగా సేవలందించే, గడువు దాటితే పరిహారం చెల్లించే సర్వీస్ గ్యారంటీలు
7. న్యాయ సంస్కరణలు
   - ఎ. అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఎఐజేఎస్) ఏర్పాటు
   - బి. స్థానిక కోర్టుల ఏర్పాటు, మహిళల రక్షణ
   - సి. CPC, CRPC చట్టాలలో సవరణలు – కోర్టుల్లో విచారణలు సులభతరం చేయటం
8. సివిల్ సర్వీసు సంస్కరణలు – ప్రతి కీలక పదవికీ పోటీ, ప్రభుత్వ శాఖలలో జవాబుదారీతనం

ప్రజల సాధికారతను పెంచే ఈ సంస్కరణలను రూపొందించటంలో, అమలులో లోక్‌సత్తా తన పూర్తి సహకారాన్ని అందిస్తుంది.

## మనదేశంలో అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు, మేయర్లకు ఈ సాధికారత ఎప్పుడు కల్పిస్తారు ప్రధానమంత్రిగారూ!



**ఇటీవల బ్రిటన్ పర్యటనలో టవర్ బ్రిడ్జి వద్ద బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామరాన్, లండన్ మేయర్ బోరిస్ జాన్సన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ**

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# అధికార, అభివృద్ధి వికేంద్రీకరణ కోసం పోరాడతాం

## సీమ అభివృద్ధి, యువత హక్కుల పరిరక్షణకు త్వరలో మరో ప్రజాఉద్యమం

- విభజన చట్టం అమలుచేయాలి, ఎ.పికి రెవిన్యూ లోటు పూడ్చాలి
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా సమానమైన సాయం వెంటనే అందించాలి
- రాయలసీమ, ఉత్తరాంధ్రకు ఆర్థికసాయం, ప్రోత్సాహకాలిచ్చి యువతకు భారీఎత్తున ఉపాధి కల్పించాలి
- పన్ను రాయితీలు అమరావతికే కాకుండా అన్ని జిల్లాలకూ వర్తింపచేయాలి
- అనంతపురంలో జరిగిన లోక్‌సత్తా పార్టీ 9వ వార్షికోత్సవ సభ 'సీమ చైతన్య భేరి'లో జేపీ

తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల అవినీతి, దుష్పరిపాలన, ఎన్నికల కుట్రల వల్లే రాష్ట్ర విభజన జరిగిందని, విభజన జరిగాక కూడా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలను దగా చేస్తూ దోచుకునే కేంద్రీకృత పాలనే కొనసాగుతోందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

అనంతపురంలో నవంబర్ 7న జరిగిన లోక్‌సత్తా పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. 'సీమ చైతన్య భేరి' పేరుతో సప్తగిరి కూడలిలో జరిగిన బహిరంగసభలో జేపీ మాట్లాడుతూ, ఈ తొమ్మిదేళ్లలో లోక్‌సత్తా ఏనాడూ అబద్ధాలను చెప్పలేదని, రాష్ట్ర విభజన సమయంలో తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య పార్టీ నష్టపోతున్నా కూడా అన్ని ప్రాంతాలలో ఒకే మాట చెప్పిందని, తెలుగు ప్రజల భవిష్యత్తు పరిరక్షణకే ఆరాటపడిందని అన్నారు. లోక్‌సత్తా ఏం చెప్పిందో అదే ఈరోజు జరుగుతోందని పార్టీని ఆరోజు విమర్శించి, అడ్డుకున్న వారు కూడా అంగీకరిస్తున్నారని అన్నారు. అబద్ధాలు చెప్పి ఓట్లు కొల్లగొట్టినవారు మళ్లీ ఈరోజు పాత దోపిడీ రాజకీయాన్నే, అధికార కేంద్రీకరణనే, ఆర్భాటపు పాలననే కొనసాగిస్తున్నారన్నారు. రాయలసీమ వెనకబాటుతనాన్ని అసెంబ్లీలో అంకెలతోపాటు లేవనెత్తి ప్రత్యేక హోదా ప్రతిపాదనను మొట్టమొదట తెచ్చింది లోక్‌సత్తాయేనని, పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధానమంత్రి చెప్పినా, ఎన్నికల సమయంలో ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు కూడా హామీ

### చంద్రబాబు పర్‌ఫెక్ట్ నెంబర్ 2 ఎగ్జిక్యూటివ్

*తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్ప ఈవెంట్ మేనేజరని జేపీ అన్నారు. పుష్కరాలు, పట్టిసీమ, అమరావతి ఇలా ఈవెంట్లతో ఆయన ప్రజల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబులా అలాంటి ఆర్భాటాలు, గిమ్మిక్కులు తనకు చేతకావన్నారు. అనంతపురంలో సభ పెట్టాలి చంద్రబాబు గారూ అంటే, ఎన్ని ఫెక్సీలు కావాలి, లోకేష్ బాబు ఫోటో ఎక్కడుండాలి, తన ఫోటో ఏ సైజులో ఉండాలి, వేదిక డెకరేషన్ ఎలా ఉండాలి, ఎన్ని వాహనాలు కావాలి, జనాన్ని ఎలా తరలించాలి, డబ్బులు ఎలా పంపిణీ చేయాలి– ఇవన్నీ బ్రహ్మాండంగా డిజైన్ చేసేస్తారన్నారు. కానీ జనం జీవితాల్ని బాగు చేసే పరిపాలన ఎలా చేయాలి అంటే మాత్రం మెమ్మే, పెప్పే అంటారన్నారు. చంద్రబాబు పర్‌ఫెక్ట్ నెం.2 ఎగ్జిక్యూటివ్ తప్ప ముఖ్యమంత్రి స్థాయి నాయకత్వ లక్షణాలు, పాలనాదక్షత ఉన్నవారు కాదు అని జేపీ అన్నప్పుడు ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది.*

ఇచ్చినా ఇంతవరకూ ఏపీకి ప్రత్యేక హోదాను సాధించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

రైతుల ఆత్మహత్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నా పట్టించుకోకుండా ఇక్కడి సాగుకి కీలకమైన బహుళార్థ పోలవరం ప్రాజెక్టు పట్ల కూడా నిర్లక్ష్యం వహించారని, పట్టిసీమ ప్రాజెక్టును హడావుడిగా చేపట్టారని, పట్టిసీమ ప్రాజెక్టు కాంట్రాక్టర్ల కోసమే తప్ప రాయలసీమ కోసం కాదని జేపీ అన్నారు. ఎంత కష్టాన్నయినా భరించే రాయలసీమ ప్రజలు అభద్రతాభావంతో నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీషువారి పాలనలో అప్పటి అధికారి థామస్ మన్రో రైతుల హక్కులకు బీజం వేస్తే, ఇప్పటి నేతలు రైతులను బిచ్చగాళ్లలా తయారుచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కుట్రపూరిత రాజకీయం నడుస్తోందన్నారు. అన్ని అభివృద్ధి వనరుల్నీ హైదరాబాద్‌లోనే కేంద్రీకరించటం వల్లే రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబాటుతనంలో మిగిలిపోయాయన్నారు.

డబ్బు లేకపోవటంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామని చెప్పిన చంద్రబాబు, అమరావతి శంకుస్థాపన కోసం రూ.400 కోట్లు ఎలా ఖర్చు పెట్టారని జేపీ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు కష్టాలలో ఉంటే చంద్రబాబు మాత్రం ప్రజల సొమ్ముతో విమానాలలో చక్కర్లు కొడుతున్నారన్నారు. ఆయనకు అమరావతిపై ఉన్న మోజు రాష్ట్ర ప్రజలపై లేదని, అందుకే మిగతా ప్రజలు ఎలా పోయినా అమరావతి ప్రాంతం వరకే పన్ను రాయితీలు అడుగుతున్నారని అన్నారు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలో పరిశ్రమలను ప్రోత్సహించాలని, యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. హుద్‌హుద్ తుపాను, పుష్కరాలు, పట్టిసీమ, అమరావతి ఇలా ఏదోక ఈవెంట్ మేనేజ్‌మెంట్లు తప్ప ప్రజల జీవితాల్ని బాగుచేస్తూ మంచి భవిష్యత్తుని నిర్మించే పాలనను అందించటం లేదన్నారు. ప్రత్యేక హోదా కోసం ప్రజలు కేంద్రప్రభుత్వంపై పోరాటం చేసి బిడ్డల భవిష్యత్తుకి బాటలు వేయాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పాలకపక్షాలు అపహాస్యం చేస్తున్నాయన్నారు. అవినీతిలో తెదేపా, వైకాపాలకు ఎలాంటి తేడా లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడైనా ఈ ప్రాంతం అభివృద్ధిపై గళం విప్పారా? అని జేపీ ప్రశ్నించారు. తాగు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చు

### ఎన్టీఆర్‌కి పూర్తి విరుద్ధంగా చంద్రబాబు

*తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు అవినీతిని, కుటుంబ రాజకీయాలని దగ్గరకు చేరనిచ్చేవారు కాదని, అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లేందుకు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేశారని, మద్య నిషేధం అమలు చేశారని, ఇప్పుడు వీటన్నిటికీ విరుద్ధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. ప్రజాధనంతో కొత్త కారు కొనుక్కోవటానికి కూడా మనసొప్పక పాత కారునే ఎన్టీఆర్ రిపేరు చేయించుకునేవారన్నారు. ప్రజల కోసం తప్ప ప్రజాధనాన్ని కేటాయించకూడదన్న రాజ్యాంగ ప్రజాస్వామ్య సూత్రాన్ని ఎన్టీఆర్ తూచ తప్పకుండా పాటిస్తే, చంద్రబాబు వందలకోట్ల ప్రజాధనాన్ని సొంత సుఖాల కోసం వినియోగించుకోవటానికి ఏమాత్రం సిగ్గుపడటం లేదని అన్నారు.*

### సీమ కంటే తక్కువ వర్షపాతమున్నా ఇజ్రాయిల్ ఎలా ఎదిగింది?

రాయలసీమ వెనకబాటుతనానికి వర్షపాతం తక్కువ కారణమని నేతలు చెప్పేమాటలు అబద్ధాలని, సీమ కంటే తక్కువ వర్షపాతమున్న ఇజ్రాయిల్ మనకంటే అనేకరెట్లు ఎక్కువ అభివృద్ధి చెందిందని జేపీ అన్నారు. ఇజ్రాయిల్ ఆదాయంలో సగభాగం వరకూ సైనిక అవసరాలకే ఖర్చు చేసినా కూడా, మనకంటే వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. మన నేతల నిర్వాకం వల్ల మన నుంచి ఇజ్రాయిల్ నేర్చుకోవాల్సిందిపోయి, ఆ దేశం నుంచి మనం నేర్చుకోవాల్సి వస్తోందన్నారు.

చేసినా ఇప్పటికీ నికర జలాలు పొందలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు.

యువత భవిష్యత్తు గురించి ఏ ఒక్క నాయకుడూ ఆలోచించటం లేదని, అధికారంలో ఉన్న తెలుగుదేశం, ప్రతిపక్షంలో ఉన్న వైకాపాలకు ప్రత్యామ్నాయంగా లోక్‌సత్తా పోరాడుతుందని జేపీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఓట్ల రూపంలోకి మారాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు త్వరలో ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నట్టు తెలిపారు. అధికారం, అభివృద్ధి వికేంద్రీకరణ జరిగినప్పుడే సామాన్యులకు నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలో జాతీయ సంస్థల్ని ఏర్పాటు చేసి ఆర్థికసాయం, ప్రోత్సాహకాలిచ్చి పరిశ్రమలతో యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రతి జిల్లాలో పర్యటించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటంతోపాటు యువత తమ హక్కుల్ని కాపాడుకునేలా లోక్‌సత్తా పోరాటాలు చేస్తుందన్నారు.

### సీమను దగా చేసింది తెలంగాణవారు కాదు

రాయలసీమ వెనకబాటుతనానికి, విభజన వల్ల నష్టానికి తెలంగాణవారు కారణమనేది అపోహ మాత్రమేనని, సీమను దగా చేసింది ఇక్కడ్నుంచి ఎన్నికైన ముఖ్యమంత్రులేనని జేపీ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు హైదరాబాద్ చుట్టూనే ఆలోచించి, తెలంగాణ ఉద్యమానికి బీజం వేసి, ఆజ్యం పోసి చివరకు అడ్డగోలు రాష్ట్ర విభజనకు కారణమయ్యారని అన్నారు. విభజన జరిగాక కూడా సీమకు, ఉత్తరాంధ్రకు అన్యాయం కొనసాగుతోందన్నారు.

బహిరంగసభకు ముందు లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన ప్రతినిధుల సమావేశం జరిగింది. కార్యక్రమాలలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ, ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని, ఇతర రాష్ట్రాల అధ్యక్షులు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేలూరు అశోక్, పార్టీ నేతలు సునీతా చౌదరి, నాగేంద్ర బాబు, శ్రీకాంత్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రాంబాబు, గణేష్ బాబు, సత్యనారాయణ, ప్రసాద్, నాగానందరెడ్డి, అమర్ యాదవ్, సాంబిరెడ్డి, గోవిందు తదితరులతోపాటు పలువురు విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ❍

## కాలానుగుణంగా మారాలి

■ **ఎన్‌జేఏసీ కొట్టివేతపై ప్రధాని**

ప్రతి సంస్థా కాలానుగుణంగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ న్యాయసేవల దినం, న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) వ్యవస్థాపక దినం సందర్భంగా సుప్రీంకోర్టు కాబోయే చీఫ్ జస్టిస్ టీఎస్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయనిపుణులనుద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, “ఏ సంస్థా స్థిరంగా కొనసాగలేదు. కాలానుగుణంగా వచ్చే మార్పులను ఆహ్వానించాలి. పాత విషయాలన్నీ మంచివే అనే మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి” అన్నారు. జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసి, జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామిక, రాజ్యాంగవిరుద్ధ పాత కొలీజియం వ్యవస్థను తిరిగి అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యల చేయటం గమనార్హం.

# అభివృద్ధి, మంచి భవిష్యత్తు కోసం బీహార్ తీర్పునివ్వటం శుభపరిణామం

## పార్టీ ప్రచారక్‌గా మారి ప్రధాని మోదీ ఓటముల్ని కొనితెచ్చుకుంటున్నారు: జేపీ



అభివృద్ధి, మెరుగైన భవిష్యత్తు కోసం బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తీర్పునివ్వటం శుభపరిణామమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

బీహార్‌లో ఇప్పటికే తన సత్తా నిరూపించుకున్న నేతకు ప్రజలు అవకాశమిచ్చారన్నారు. "బీహార్ తీర్పు నితీష్ కుమార్‌కి అసాధారణ విజయం. బీహార్‌కి మంచి సేవలందించిన ఆయన పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారు. నితీష్ పరిపాలనకు లాలూ ప్రసాద్ అవరోధాలు సృష్టించరని ఆశిద్దాం" అని జేపీ అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఎన్నికల ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని జేపీ అన్నారు. "భారత్‌ని సమున్నత స్థాయికి తీసుకెళ్లాలని మోదీకి 2014లో ప్రజలు పట్టంగట్టారు తప్ప బీజేపీని విస్తరించుకోండని కాదు. అందరినీ కలుపుకుని వెళ్లే సానుకూల ఎజెండాతో మోదీ ప్రజల మనసుల్ని ఆనాడు గెలుచుకున్నారు. ఎన్నికల సమయంలో చెప్పినదానికి భిన్నంగా, పార్టీ ప్రచారక్‌గా మారి ప్రధానిగా తన లక్ష్యాల్ని పక్కనబెట్టటం ప్రజలలో విముఖతకు దారితీస్తోంది.

నిజమైన హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా కొందరు బీజేపీ వారు 'హిందూత్వ' పేరుతో పెడధోరణులకు పాల్పడటం, నిజమైన అభివృద్ధికి అవసరమైన విద్య, ఆరోగ్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం ప్రజల అనుమానాలను మరింత పెంచింది. 2014లో తనకు ఇచ్చిన తీర్పునకు మోదీ కట్టుబడి ఉండాలి. ప్రధాని ఢిల్లీ, బీహార్‌లో ఎన్నికల ప్రచారక్‌గా మారటం తప్పిదం, చేజేతులారా ఓటమిని కొనితెచ్చుకోవటం" అని జేపీ అన్నారు.

**నిజమైన హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా కొందరు బీజేపీ వారు 'హిందూత్వ' పేరుతో పెడధోరణులకు పాల్పడటం, నిజమైన అభివృద్ధికి అవసరమైన విద్య, ఆరోగ్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం ప్రజల అనుమానాలను మరింత పెంచింది.**

నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నిజంగా అవకాశాలు అందుకోలేనివారికి ఎదిగే అవకాశాల్ని అందించకుండా ప్రపంచంలో ఏ దేశమూ గొప్పస్థాయికి ఎదగలేదని మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలని, అభివృద్ధిలో భారతీయులందరూ భాగస్వాములయ్యే పాలనను అందించాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❍


# ఇలాగైతే దక్షిణాదిలో మోదీకి మరీ కష్టం




బీహార్ ఎన్నికల ఫలితాలు కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించినవి, జాతీయ స్థాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు కాదది, అయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముచ్చెమటలు పడుతున్నాయి. మనదేశ వ్యాప్తంగానే కాకుండా విదేశీ మీడియాలో కూడా బీహార్ తీర్పు చర్చనీయాంశమైంది. ఎందుకింత అంటే, మోదీ వల్లే. ఇక్కడ మిగిలిన పార్టీలన్నిటికంటే బీజేపీ అత్యధిక ఓట్లు తెచ్చుకున్నా ఆ నిష్పత్తిలో సీట్లు రాకపోవటం, తమ పార్టీ ఓడినా హిందూత్వ ఓట్లు సంఘటితమయ్యాయని ఆర్ఎస్ఎస్ సంబరపడుతుండటం వంటి వాస్తవాలు కూడా ఉన్నా.. 2014లో ఇదే చోట, ఇదే ఆటనియమాల మధ్య నరేంద్ర మోదీ సాధించిన విజయంతో పోలిస్తే, తాజా ఎన్నికల్లో ఆయన మోహరించిన తీరును పరిగణలోకి తీసుకుంటే, ఖచ్చితంగా ఇది మోదీకి పెద్దఓటమి అనటంలో సందేహం లేదు. 2015 అసెంబ్లీ ఎన్నికలలో 243 స్థానాలకుగాను మహాకూటమికి 178 సీట్లు రాగా, ఎన్డీయేకి కేవలం 58 వచ్చాయి. ఓట్ల తేడా 8శాతం ఉంది. నితీష్ నమూనా అభివృద్ధి గెలుస్తుందా? మోదీ నమూనా అభివృద్ధి గెలుస్తుందా? అనే చర్చను కూడా కొందరు లేవనెత్తినా, జనం, ముఖ్యంగా బీహార్ యువత, మహిళలు తమ జీవితాల్ని అభివృద్ధి చేయటానికి నితీష్ని, మోదీని సమానంగానే చూశారనే చెప్పాలి. నితీష్ అభివృద్ధి నమూనాలో బీజేపీ కూడా చాలా ఏళ్లు భాగస్వామిగా ఉంది కూడా. అందుకే 2014 లోక్సభ ఎన్నికల్లో మోదీకి పట్టంగట్టారు. అయితే మోదీ ఏకపక్ష ధోరణులతో తన ఎజెండా నుంచి తానే వైదొలగుతుండటంతో మోదీ చెప్పినా వినకుండా, ఇప్పటికే రాష్ట్రంలో నిరూపించుకున్న నితీష్కి పట్టంగట్టారు. నోటాకు కూడా 9లక్షల పైచిలుకు ఓట్లు పడ్డాయి. అందుకే, లాలూ ఏమేరకు నితీష్ని పనిచేయనివ్వగలగుతారు అనే బలమైన అనుమానాల్ని వ్యక్తం చేస్తూనే, ఎన్డీయేతో వెళ్లి ఉంటే నితీష్ కుమార్ గ్యారంటీగా ఓడిపోయి ఉండేవారనే ఆసక్తికర విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. ఢిల్లీలో ఆమ్ఆద్మీ (ఆప్) పార్టీపై ఓటమి కన్నా బీహార్ ఓటమి ప్రభావం తీవ్రంగా, విస్తృతంగా ఉంటుంది.

ఢిల్లీ భిన్నమైన క్షేత్రం, ఆప్ కొత్త రాజకీయ లక్షణాలతో వచ్చిన పార్టీ కావటం వల్ల మనదేశ నేపథ్యంలో మోదీకి అంత వేగంగా ప్రమాదం కనిపించదు. అందులో ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఎటువంటి కొత్త రాజకీయ ఎజెండా లేకుండా కేవలం కొత్త రాజకీయ సంస్కృతిలోని కొన్ని అంశాలకే పరిమితమవటం, వ్యక్తిగత పోకడలతో ఢిల్లీకే పరిమితమై అంతా తన చుట్టూనే తిప్పుకుంటుండటం వల్ల మోదీకి ఢిల్లీ ట్రెండ్ వల్ల అప్పుడే పెద్ద సమస్య ఏమీ ఉండదు. కానీ బీహార్ అలా కాదు. పాత రాజకీయ నమూనాలో ప్రతిపక్షాలన్నీ ఏకమై దెబ్బకొట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. 2014 ఎన్నికలలో ప్రాంతీయ, సంకుచిత పార్టీలకు భిన్నంగా కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా మోదీ తాను చెప్పిన అభివృద్ధి నమూనాకు కట్టుబడి ఆ ఎజెండాతో వెళ్లి ఉంటే, ఈ పరిస్థితి తలెత్తేది కాదు. కానీ తాను చెప్పింది చేయకుండా, పాత రాజకీయానికి నకలుగా వ్యవహరిస్తూ, పార్టీలో ఇంకెవ్వరూ లేరన్నట్టు తానే రాష్ట్రాల్లో కూడా ప్రచారక్గా మారటం వల్ల చేతులారా సంక్షోభమనదగ్గ కష్టాల్ని ఆయన కొనితెచ్చుకున్నారు. బీహార్

ఎన్నికల తుది అంకంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నట్టు ఎన్డీయే కూటమి ఓడితే పాకిస్తాన్‌లో టపాసులు పేలలేదుగానీ, భారతదేశవ్యాప్తంగా పలువురు లోలోపల చాలా సంతోషించారు. అధికారమే సర్వస్వమనే ఎన్నికల రాజకీయాలలో కూరుకుపోయిన పార్టీలవాళ్లని పక్కనపెడితే, దేశ భవిష్యత్తు కోసం 2014లో నరేంద్ర మోదీకి ఎన్ని విమర్శలచ్చినా మద్దతిచ్చినవారు కూడా ఇలా జరగాల్సిందే అని భావిస్తున్నారంటే, మోదీ చాలా లోతైన సమీక్ష చేసుకోవాలి.




తనకు ప్రధాని అయ్యే అవకాశం కల్పించిన సొంత పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మోదీకి ఉంటుందనటంలో సందేహం లేదు. అయితే, తాను ఎన్నికలలో ఇచ్చిన హామీలకనుగుణంగా తన పనితీరు ద్వారా ప్రజల మెప్పుని పొందుతూ పార్టీని గెలిపించుకుని ఉంటే ఆరోగ్యకరమైన రాజకీయాన్ని ఆయన పాదుకొలిపి ఉండేవారు. కానీ, తన హామీల నుంచీ పక్కకు తొలగి, తనకజోక్యం ప్రత్యక్షంగా పెద్దగా అవసరంలేని కూడా రాష్ట్రాల రాజకీయాల్లో తలదూర్చి, చివరికి బీహార్‌లో ఎన్డీయే ఓటమి మోదీ ఓటమి అనిపించుకున్నారు. టెక్నాలజీతో, ఆకర్షణీయ నాయకత్వంతో జనం జీవితాలు మారిపోవు. జనం జీవితాలు మారాలంటే చాలా ముందుచూపుతో, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ విధానాలను, వ్యవస్థల్ని నిర్మించాల్సి ఉంటుంది. అందునా భారత్ వంటి దేశంలో మార్పు కోసం ఇంకా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ లాంటి వారే ఈ విషయాన్ని చెప్పారు. చైనాలాంటి అత్యధిక జనాభా ఉన్న దేశంకంటే కూడా భారత్‌లో మార్పుని తీసుకురావటం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ అని లీ అన్నారు. అంతటి భిన్నత్వం, వైవిధ్యం ఇక్కడ ఉంది. తనకు 2014 ఎన్నికల్లో ఊహించని మెజారిటీ రావటంతోనే ఈ వాస్తవాల్ని వదిలేసి తన స్వభావానికి, తన పార్టీ అవసరాలకు తగ్గట్టు కొంతమంది సివిల్ సర్వీసు ఉద్యోగుల మీద ఆధారపడిన కేంద్రీకృత పాలనావ్యవస్థను, మీడియాలో హెడ్‌లైన్స్ తయారుచేసే ప్రచారవ్యవస్థను ఏర్పాటు చేసుకుని చిటికెలు వేస్తూ కలలు అమ్ముతానంటే, నమ్మటానికి జనం ఎల్లకాలం అమాయకులుగా ఉండరు గదా!

భారతదేశం వేగంగా ఎదగాల్సిన సమయంలో అవినీతి, ఆశ్రితపక్షపాతాలు, వంశపారంపర్య, విద్వేష రాజకీయాలలో కూరుకుపోయి ప్రజలను బిచ్చగాళ్లుగా కొనసాగించే విధానాలను అనుసరించిన కాంగ్రెస్ పార్టీకి, దానికి నకలుగా ఉండే ప్రాంతీయ పార్టీలకు భిన్నంగా మోదీ, విభజన రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తలెత్తుకుని బతికే జీవితాన్నందించే అభివృద్ధి నినాదంతో ప్రజలకు 2014 ఎన్నికలలో ఒక ఆశాకిరణంలా కనిపించారు. కొన్ని దశాబ్దాల తర్వాత స్పష్టమైన మెజారిటీతో, అన్ని వర్గాలూ ఆయన్ని ఎన్నుకున్నారు. అందుకే ప్రతిపక్ష కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు ఏమాత్రం పుంజుకోకపోయినా మోదీ ప్రాభవం దిగజారిపోవటం దేశ ప్రయోజనాలను కాంక్షించేవారిని కలవరపరుస్తోంది కూడా. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నా, జాతీయస్థాయిలో దారంలా ఉపయోగపడతామంటూ ఏదోరకరకంగా మనుగడ సాగించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్‌కి నాయకత్వం మారితే ఇంకా ఊపు రావచ్చు, కానీ బీజేపీకి మోదీ నాయకత్వం మారితే చతికిల పడే అవకాశాలు ఎక్కువ. తట్టి లేపుతున్న వాస్తవాల్ని అర్థం చేసుకుని మోదీ మేలుకుంటే సరే, లేదంటే ఉత్తరాదిలోనే పనిచేయని మోదీ టెక్నిక్కులు, ట్యాక్టిక్కులు కాస్త సంస్కరణల ప్రభావాన్ని జీర్ణించుకున్న దక్షిణాదిలో అసలు పనిచేయవు. దేశానికి, చివరికి ఆయన పార్టీకి కూడా నష్టం చేకూరే పరిస్థితులు ఏర్పడతాయి.

ఈ నేపథ్యంలో, బీహార్ ఎన్నికలలో గెలుపుఓటములకు దారితీసిన సమీకరణాల చుట్టూ అతిగా చర్చను తిప్పకుండా.. బీహార్ ప్రజలు అభివృద్ధికి, మెరుగైన భవిష్యత్తుకి నితీష్‌ని

గెలిపించటం మంచి పరిణామమే. మోదీ రాష్ట్రాల్లో అధికారం, హిందూత్వ ఎజెండాల జోలికి వెళ్లకుండా ప్రధానిగా తాను చేయాల్సిన బాధ్యతల మీదే దృష్టి పెట్టాలి అనే అంశాలకే పరిమితమవటం వల్ల దేశ ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుంది.

ఇంతకు ముందే అనుకున్నట్టు.. చైనా నమూనాలో, గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో, సాంప్రదాయ రాజకీయంతో కొందరు అనుకూలురైన ఐఏఎస్ అధికారులను తన చుట్టూ ఏర్పరుచుకుని కేంద్రీకృత పాలనతో మోదీ ప్రధానిగా అడుగులు ప్రారంభించారు. భారత్ వంటి సంక్లిష్టత, భిన్నత్వం ఉన్న దేశంలో ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించాలంటే సాంప్రదాయ ఐఏఎస్ పరిజ్ఞానం ఒక్కటే చాలదు, ప్రజల పట్ల చాలా ప్రేమ, దార్శనికత, క్షేత్రస్థాయి అవగాహన చాలా అవసరం. అలా ఉన్న ఐఏఎస్‌లెవరూ మోదీ వద్ద లేరు. ఉన్న ఐఏఎస్‌లను మించి సామర్థ్యం చూపగలవారు కూడా ఆయన మంత్రివర్గంలో లేరు. అదయ్యాక, మోదీ దిగువస్థాయి ఉద్యోగుల ప్రక్షాళన మీద దృష్టి పెట్టారు. అవసరమే. ప్రభుత్వోద్యోగులు లంచాలు, పైరవీలు లేకుండా ఒళ్లువంచి ప్రజలకు సేవచేసేలా చేయటం తక్షణావసరమే. అయితే అందుకు కూడా ఆయన వ్యవస్థీకృత మార్పు చేయకుండా ఇన్‌స్పెక్టర్‌లాగా తనిఖీల హడావుడితో మీడియాలో హీరోయిక్ ప్రచారం పొందే మార్గాన్నే అనుసరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలనందించే 'సిటిజన్ సర్వీస్ గ్యారంటీ' వంటి చట్టాలను పక్కనపెట్టారు.

ఆ తర్వాత కొందరు సివిల్ సర్వీసు అధికారులు రూపొందించినరీతిలో పనికిమాలిన రీతిలో 'స్వచ్ఛభారత్' మిషన్‌ని మోదీ చేపట్టారు. పారిశుద్ధ్యంలో కీలకపాత్ర పోషించే స్థానిక ప్రభుత్వాల పాత్ర లేకుండా రూపొందించటం వల్ల దాదాపు వెయ్యికోట్లకు పైగా ప్రచార ఆర్భాటానికి ఖర్చయినా, స్వచ్ఛభారత్ వల్ల కించిత్తు కూడా ఫలితం రాలేదు. సాంఘిక సంస్కరణలు, కార్యక్రమాల ద్వారా కూడా ప్రజలలో చైతన్యం తేవటం కూడా మంచి రాజకీయానికి అవసరం కాబట్టి స్వచ్ఛభారత్‌ని ఆమేరకు స్వాగతించినవారు కూడా నీరసించిపోయేలా తయారైంది ఆ మిషన్. దేశంలోని అత్యుత్తమ ఆలోచనాపరుల కూర్పుతో ఏర్పాటుచేసిన జాతీయ సలహామండలి వల్ల కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే-1 ఎంతో లబ్ధి పొందింది. ఆ తర్వాత జాతీయ స్థాయి పనుల్ని వదిలేసి రాష్ట్రాల్లో అధికారాల కోసం చౌకబారు రాజకీయాలను కాంగ్రెస్ ఎప్పుడైతే మొదలుపెట్టిందో, అప్పుడు జాతీయ సలహామండలి నుంచి కొందరు వైదొలిగారు. ఆ తర్వాత యూపీయే-2లో సలహామండలిగా పనిచేసిన వారి కన్నా సరకు తక్కువవాళ్లు ఇప్పుడు మోదీ చుట్టూ ఉన్నారు. వ్యవస్థల్ని భ్రష్టుపట్టిస్తున్నారు. మూడోసారి ఎన్నికల్లో యూపీయే పరాభవానికి కారణాల్ని మోదీ విస్మరిస్తున్నట్టు కనిపిస్తోంది.

ఆ తర్వాత అవినీతి నిరోధక చట్ట సవరణలో కూడా మోదీ ఏ అధికారుల మాట విన్నారోగానీ, అవినీతి అధికార గణాన్ని కాపాడేలా, లోక్‌పాల్‌ను, అవినీతిపై పోరును నీరుగార్చేలా '17ఎ'ను అందులో చేర్చేలా ప్రతిపాదించారు. పైస్థాయిలో అవినీతి లేదంటున్నారుగానీ, తనలాగా నిజాయతీపరులైన నితీష్, నవీన్ పట్నాయక్ లాంటి వాళ్లు పలువురు ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ప్రజల్ని జలగల్లా పీడిస్తోందని ఆయన పట్టించుకోవటం లేదు. ఓటుకు కోట్లు కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా సీబీఐ విచారణ చేయించేందుకు చొరవ చూపకుండా ఉదాసీనంగా వ్యవహరించటం ఏ విధమైన అవినీతి వ్యతిరేక పాలన మోదీ గారూ?

*పై స్థాయిలో అవినీతి లేదంటున్నారుగానీ, తనలాగా నిజాయతీపరులైన నితీష్, నవీన్ పట్నాయక్ లాంటి వాళ్లు పలువురు ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ప్రజల్ని జలగల్లా పీడిస్తోందని ఆయన పట్టించుకోవటం లేదు. ఓటుకు కోట్లు కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా సీబీఐ విచారణ చేయించేందుకు చొరవ చూపకుండా ఉదాసీనంగా వ్యవహరించటం ఏ విధమైన అవినీతి వ్యతిరేక పాలన మోదీ గారూ?*

ఇక విదేశాలలో పర్యటనలకు నెహ్రూలాగా మోదీ కూడా చాలా సమయం వెచ్చించినా అవి ఈవెంట్ మేనేజ్‌మెంట్లలా తయారయ్యాయి తప్ప దేశానికి పెద్దగా ఫలితాలు కనిపించడం లేదు. మోదీ విదేశీ కార్యక్రమాలకు దేశీయంగా విపరీత ప్రచారం వస్తోంది తప్ప పెద్దదేశాలలో ఎక్కడా మీడియా కూడా

పట్టించుకున్న వైనం లేదు. ఒక దార్శనికత, స్పష్టమైన ప్రణాళిక లేకుండా కేవలం వ్యాపార దృష్టితో విదేశాంగ విధానాన్ని అనుసరించటం వల్ల అడపాదడపా తప్ప గణనీయ ఫలితాలు రావటం లేదు. తనను ధిక్కరించివారిని, విమర్శించినవారిని మోదీ సహించబోరని వచ్చే విమర్శలను నిజం చేస్తున్నట్టు నేపాల్‌పై ఆంక్షలు విధించి వ్యూహాత్మక తప్పిదం చేశారు.

మూస ధోరణితో, మేధస్సు అక్కర్లేదన్నట్టు మోదీ వ్యవహరించనారంభించటం వల్ల స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా ఇలా సానుకూల కార్యక్రమాలు సహా ఏదీ చెప్పుకోదగిన ఫలితాన్నివ్వలేదు. ఎన్నారైలకు భారత్ పట్ల అభిమానం ఉండవచ్చు కానీ వారిని విదేశాల్లో భారతీయ ఏజెంట్లులా మార్చాలనుకోవటం ఏమేరకు ఫలితాలనిస్తుంది?

ఇక భారతదేశ ఔన్నత్యానికి అన్నిటికంటే కీలకమైనవి విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, గ్రామాలు, సామరస్యం. నాణ్యమైన విద్య, ఆరోగ్యం లేకుండా ప్రపంచంలో ఏ దేశమూ గొప్పదైన దాఖలాలు లేవు. అయినా ఇంతవరకూ ఆ రంగాల్లో మోదీ ప్రభుత్వం సాధించింది శూన్యం. కనీసం పట్టించుకోలేదు. వ్యవసాయ రంగంలో సంక్షోభం రోజురోజుకీ తీవ్రతరమవుతున్నా ఆయన ఒక స్పష్టమైన పరిష్కారాన్ని ప్రకటించలేకపోయారు.

విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటంలో, దేశాభివృద్ధి గురించి తపన చెందటంలో మోదీ ప్రశంసనీయ కృషే చేస్తున్నారు. కానీ అవి చేయాల్సిన దాంట్లో కొంత భాగం మాత్రమే. ప్రజలందర్నీ భాగస్వాముల్ని చేసే రీతిలో అభివృద్ధికి వ్యవస్థీకృత నిర్మాణం చేయకుండా కేవలం కొద్దిమందికి మాత్రమే ఉపయోగపడే రీతిలో చేయటం వల్ల ఎంత మేర ప్రయోజనముంటుంది? సోనియా, రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ హయాంతో పోలిస్తే తాను ఎంత మెరుగో మోదీ చెబుతున్నారుగానీ, ప్రజలకు తాను ఇచ్చిన వాగ్దానాలతో పోలిస్తే తాను ఇప్పటివరకూ చేసింది బహుస్వల్పం అని ఆయన ఇప్పటికీ గుర్తించలేకపోతున్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం గురించి ఆయనో యుద్ధవాతావరణం సృష్టించి కృషి చేయనక్కర్లా.

ఏడాదికి కోటిన్నర ఉద్యోగాలు కావాల్సి ఉండగా, కనుచూపు మేరలో ఆ అవకాశాలు కన్పించటం లేదు. కేవలం ఏడాదిన్నరలో మోదీ అద్భుతాలు చేస్తారని ఎవరూ అనుకోవటం లేదు, కానీ ఆ దిశగా ఎక్కడా ప్రయత్నాలు కూడా లేవు. అది ప్రజలలో తీవ్ర విముఖతను కలిగిస్తోంది. పార్లమెంటులో కీలకమైన భూ సేకరణ, జీఎస్‌టి వంటి బిల్లుల ఆమోదం విషయంలో కూడా ఆయన ఎటువంటి చాకచక్యాన్ని, దేశ ప్రయోజనాలకవసరమైన ముందుచూపుని ప్రదర్శించలేక పోయారు. ప్రతిపక్షాలు అభివృద్ధికి వ్యతిరేకమని జనం అనుకునేలా కదనోత్సాహం చూపారు తప్ప పరిష్కారం మీద దృష్టి పెట్టి ప్రతిపక్షాలను కలుపుకుని పోయే ప్రయత్నం చేయలేదు. కనీసం లోక్‌సత్తా సూచించినట్టు, రాజ్యసభను సంస్కరించి ఆర్థిక సంబంధ బిల్లుల్ని ఆమోదించే అధికారం ప్రజలు ఎన్నుకున్న లోక్‌సభకు మాత్రమే ఉండాలే చేయాలన్న సృజనాత్మక పరిష్కారాన్ని కూడా పరిశీలించే సాహసం చేయలేకపోయారు. పార్లమెంటరీ వ్యవహారాలు చూస్తున్న

> *సోనియా, రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ హయాంతో పోలిస్తే తాను ఎంత మెరుగో మోదీ చెబుతున్నారుగానీ, ప్రజలకు తాను ఇచ్చిన వాగ్దానాలతో పోలిస్తే తాను ఇప్పటివరకూ చేసింది బహుస్వల్పం అని ఆయన ఇప్పటికీ గుర్తించలేకపోతున్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం గురించి ఆయనో యుద్ధవాతావరణం సృష్టించి కృషి చేయనక్కర్లా.*

వెంకయ్య నాయుడు లాంటి వారికి అందరినీ దేశ ప్రయోజనాల కోసం ఏకతాటి మీదకు తెచ్చేంత సామర్థ్యమైతే లేదు. తెలుగునాటే వెంకయ్య ఎప్పుడు దొరుకుతారా, పంచె ఊడదీసి తరుముదామని చూస్తున్నారు.

ఈ అంశాలన్నిటినీ లోక్‌సత్తా ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ పరిష్కారాలను అందిస్తూనే ఉంది.

ఉప్పునిప్పులా అధికార, ప్రతిపక్షాలు ఉంటున్నా లోక్‌సత్తా కృషితో వచ్చిన ఉన్నత న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) బిల్లును పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది, 20 రాష్ట్రాల అసెంబ్లీలు కూడా ధృవీకరించాయి. ఇలాంటి ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా కొట్టివేస్తే, రాజ్యాంగ స్ఫూర్తిని, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని కాపాడటానికి వెంటనే నిర్మాణాత్మకంగా స్పందించే స్థాయే ప్రభుత్వానికి కరవైంది. ప్రధానమంత్రిగారు బస్తీ మే సవాల్ తరహాలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్నారు.


బీహార్ ఎన్నికల ప్రచారంలో కూడా మోదీ 2014లో తాను చెప్పిన అభివృద్ధి, ఉద్యోగాలు, కులమతాలకతీతమైన పాలన గురించి ఎక్కువ ప్రస్తావించకుండా, రిజర్వేషన్లు, ఆవు మాంసం వినియోగంపై కూడా స్పష్టమైన సానుకూల వైఖరిని ప్రకటించకుండా ప్రజల్లో అనుమానాలు పెరిగేలా మాట్లాడారు. దేశంలో అసహనం పెరుగుతోందంటూ కొందరు మోదీ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని వెంకయ్య నాయుడులాంటి వారు మీడియాలో స్థలాల్ని కబ్జా చేసి మరీ వ్యాసాలు, ఫుటేజీలు నింపేకంటే, మోదీ చేత సకాలంలో, సరైన రీతిలో కాసిని ట్వీట్లు చేయిస్తే సరిపోయేది. క్రికెటర్ పెళ్లికి, పుట్టిన రోజుకి కూడా ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపే మోదీ, ఆవు మాంసం తినటానికి దాచుకున్నారని ఒక వ్యక్తిని రాళ్లతో కొట్టిన వివాదాస్పద ఘటనపై స్పందించలేరా? శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశమని సాంకేతికంగా తప్పించుకునే ప్రయత్నం చేయటాన్ని ప్రజలు తీవ్రంగా పరిగణించారు. అలాగే రిజర్వేషన్లపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యల వల్ల వివాదం వచ్చినప్పుడు, రిజర్వేషన్లలో సంస్కరణ జరిగితేనే అర్హులకు న్యాయం జరుగుతుందని ప్రజలకు మోదీ నచ్చచెప్పలేరా?

అసెంబ్లీ అనుమతిలేకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆమోదం లేకుండా రాష్ట్ర విభజన జరిగింది కాబట్టి అన్ని రకాలుగా కేంద్రమే ఆదుకోవాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని సాక్షాత్తూ ప్రధానమంత్రి పార్లమెంటులో చెప్పినా, తన సొంత పార్టీ వారు కూడా పార్లమెంటులో, పలు ఎన్నికల సభల్లో చెప్పినా, తాను కూడా పలుమార్లు అంగీకారం తెలిపినా, ఆ ఊసే ఎత్తకుండా ఏదో చేస్తున్నట్టు నటించటం మోదీ లాంటి వాళ్లు చేయటాన్ని తెలుగు ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మోదీ వేవ్ తెలుగునాట లేకపోయినా, 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలవటానికి పట్టణ ప్రాంతాలలో మోదీ ప్రభావం కొంత దోహదం చేసిందనటంలో సందేహం లేదు. అయితే అది సుస్థిరం కాకపోగా, ఆయన పట్ల విశ్వసనీయత క్రమంగా సన్నగిల్లిపోతోంది. అమరావతి శంకుస్థాపన సమయంలో ప్రత్యేక హోదా, ఆర్థికసాయాన్ని ప్రకటించకుండా పార్లమెంటు మట్టిని, యమునా నది నీటి చెంబుని ఇస్తే సంతృప్తి పడటానికి తెలుగువాళ్లు అమాయకులు కారు. ప్రత్యేక హోదా కావాలని ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అడగకపోవటం వల్ల మోదీ మీద విమర్శలు కొంత తగ్గాయికానీ, ఇవ్వాల్సింది మోదీయేననే స్పష్టత ప్రతి తెలుగువానికీ ఉంది. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోదీ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడలా తయారైంది. ఆయన వచ్చివెళ్లాక తెలుగునాట బీజేపీ పరిస్థితి మరీ దిగజారింది. బహుశా తెలుగువాళ్లని దెబ్బేసినట్టు తమకు కూడా మోదీ దెబ్బేస్తారనే అనుమానంతో మోదీ ప్యాకేజీని బీహారీలు కూడా విశ్వసించకపోయి ఉండవచ్చు.

*కొందరు బీజేపీ వాళ్లు ప్రతిపాదిస్తున్న హిందూత్వ భావనతో భారతదేశానికి ఒక అస్తిత్వ నిర్వచనాన్ని ఇవ్వాలని, కొన్ని దశాబ్దాలపాటైనా ఈ దేశాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలాలని మోదీకి ఉండవచ్చు. కానీ నిజమైన హిందూ తత్వం భిన్నత్వాన్ని గౌరవిస్తూ వసుధైక కుటుంబ భావనను ప్రతిపాదించే భారతీయమే తప్ప ఆ కొందరు చెబుతున్న హిందూత్వ కాదు.*

కొందరు బీజేపీ వాళ్లు ప్రతిపాదిస్తున్న హిందూత్వ భావనతో భారతదేశానికి ఒక అస్తిత్వ నిర్వచనాన్ని ఇవ్వాలని, కొన్ని దశాబ్దాలపాటైనా ఈ దేశాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలాలని మోదీకి ఉండవచ్చు. కానీ నిజమైన హిందూ తత్వం భిన్నత్వాన్ని గౌరవిస్తూ వసుధైక కుటుంబ భావనను ప్రతిపాదించే భారతీయమే తప్ప ఆ కొందరు చెబుతున్న హిందూత్వ కాదు. ఆ హిందూత్వకు పునాదిగా చెబుతున్న పుస్తకాలలో.. యువ భారతదేశం కలలుగంటున్న నూతన భారతదేశ నిర్మాణానికి కావలసిన మేధో, నైతిక బలం లేదు. ఆ ఉపరితల స్థాయి భావజాలాన్ని పట్టుకుని ఈదేశాన్ని నడిపించాలనుకుంటే దారుణ వైఫల్యం తప్పదు. నల్లధనం వెనక్కితేవటం, సైనికోద్యోగులకు ఒకే ర్యాంకు-ఒకే పింఛను విధానం, స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా, విదేశాంగ విధానాలలో మోదీ అవగాహనారాహిత్యం ఇప్పటికే బైటపడింది. విద్వేష హిందూత్వలోని సైద్ధాంతిక డొల్లతనాన్ని గుర్తెరిగి వ్యవహరించకపోతే అది చారిత్రక తప్పిదమవుతుంది. దేశం కంటే వ్యక్తులు, పార్టీలు ముఖ్యం కాదు. ప్రధానిగా, ఓ పార్టీ నేతగా నరేంద్రమోదీ తనకున్న అరుదైన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలంటే, ఉత్తరాదిలో నిలదొక్కుకుని దక్షిణాదిలో బలపడేలా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉద్యోగాలు, స్థానిక సాధికారత తదితర అంశాల చుట్టూ సానుకూల ఎజెండాతో, అందరినీ కలుపుకుని పనిచేయటం మొదలుపెట్టాల్సిందే. ❍


# కమల్ ఈ డైలాగ్ చెప్పలేకపోయారు



ఇటీవల మనదేశంలో పెరిగిపోతున్న అసహన ధోరణులకు నిరసనగా పలువురు కళాకారులు, ప్రముఖులు తమ అవార్డులను తిరిగి ఇచ్చేస్తున్న ఘటనలపై కమల్ హాసన్ స్పందించిన తీరు చూస్తే, 2013లో 'విశ్వరూపం' సినిమా వివాదం సమయంలో కమల్ స్పందనకు, తాజా వ్యాఖ్యలకి ఎంత తేడా? అనిపించకమానదు. 'విశ్వరూపం' అనే బహుభాషా చిత్రాన్ని సెన్సార్ పూర్తయిన తర్వాత కూడా మైనారిటీల మనోభావాల పేరుతో తమిళనాడులో విడుదల కాకుండా అడ్డుకోవటం పట్ల ఆ చిత్ర హీరో, సారథి కూడా అయిన కమల్ హాసన్ అప్పట్లో చాలా ఆవేదనతో స్పందించారు. తన పట్ల ఇదేతీరుగా వ్యవహరిస్తే భారతదేశాన్ని వీడి వెళ్లిపోవటానికి సైతం వెనకాడనని ఆయన హెచ్చరించారు. ఈ తర్వాత ఎలాగోలా సినిమా విడుదలైంది, సమస్య మరుగునపడిపోయింది. అదే ఈవేళ నిరసన వ్యక్తం చేయటానికి కొందరు అవార్డులను వెనక్కిస్తుంటే, దేశంలో అసహనం పెరుగుతోందని అంగీకరిస్తూనే.. పురస్కారాలను తిరిగివ్వటం సరికాదని కమల్ అంటున్నారు. అవార్డులను వేరే మైండ్‌సెట్ ఉన్నవారు ఇస్తారని, దాన్ని తిరిగివ్వటం తగదని, మత అసహనంపై పోరాడేపద్ధతి అది కాదని హితవు చెబుతున్నారు. మనం గాంధీలా సత్యాగ్రహంతో వేరే మార్గంలో పోరాడాలన్నారు. ఒకవేళ అవార్డులను తిరిగివ్వాల్సిందే అనుకుంటే, దాంతోపాటు వచ్చిన డబ్బుని కూడా తిరిగివ్వాలని సూచించారు.

అవార్డులు తిరిగి ఇచ్చేయటం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి వాళ్ల స్వాతంత్ర్యానికి ముందు కూడా అనుసరించిన నిరసన పద్ధతే. ఇప్పుడు అది సరైనదా, కాదా తర్వాతి విషయం. ఈ అవార్డులు తిరిగి ఇస్తున్నవారు గతంలో ఉదాసీనంగా వ్యవహరించినవారు, ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే అతిగా స్పందిస్తున్నవారు కూడా అయి ఉండవచ్చు. కానీ అంతకంటే ముఖ్యం - మత మార్పిడులు, ఆహారపు అలవాట్లు, ఉమ్మడి సివిల్ కోడ్ ఎప్పుడు అంటూ విలువైన కాలాన్ని వృథా చేయటాన్ని ఎదుర్కోవటం. తన సొంత సినిమా కోసం భారత్ వీడి వెళ్లిపోతానన్న కమల్ కంటే, దేశంలో అసహనానికి, పాలకులు ఎన్నికలలో చెప్పిన దానికి ఇప్పుడు చేస్తున్నదానికి పొంతన లేకపోవటానికి వ్యతిరేకంగా అవార్డుల్ని తిరిగిస్తున్నవారు కొంత బెటరే గదా. దీన్ని కమల్ అంగీకరించి, మరి ఏరకంగా నిరసన చెప్పాలో కూడా తెలియచెప్పి ఉంటే బాగుండేది. అలాగే, తన సినిమాలపై దాడులు చేసే వాళ్లకు ఇది తప్పు అని చెప్పేవారు లేరని కూడా తన తాజా ఇంటర్వ్యూలో కమల్ వాపోయారు. దీనికి కూడా ఆయన పరిష్కారం చెప్పలేకపోయారు. 'భారతీయుడు' సినిమాతో వ్యవస్థపై ప్రజల్ని కుదిపేసిన లోకనాయకుడికి ఏమీ తెలియదనుకోవటానికి వీల్లేదు. తనలాగా ప్రజల్లో కొంత ప్రభావం చూపగలిగినవారు వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, చట్టబద్ధ పాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని సేవలు, అధికార వికేంద్రీకరణ, రైతులకు ఆదాయం, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి వంటి విధానాల చుట్టూ తిరిగే మంచి రాజకీయంలో భాగస్వాములమవటమే నేటి దుస్థితికి కీలక పరిష్కారమనే డైలాగ్‌ని కమల్ హాసన్ ధైర్యంగా చెప్పగలిగి ఉంటే ఓ రేంజ్‌లో మార్పునకు దోహదం చేసినవారై ఉండేవారు. ❍


# గాంధీ అంటే సృజనాత్మక ప్రజాసేవ తప్ప విగ్రహాలు, దేవాలయాలు కావు: పటేల్



ప్రపంచ చరిత్రలోనే అద్భుతమైన రీతిలో భారతదేశాన్ని దాదాపు రక్తపాతం లేకుండా ఏకం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ బతికుంటే, ప్రపంచంలోనే అతిపెద్ద తన విగ్రహం కోసం రూ.3,000 కోట్లు ఖర్చు చేయటాన్ని అంగీకరించే వారా అనేది సందేహమే. గాంధీజీ మరణానంతరం ఫిబ్రవరి 22, 1948న 'హరిజన బంధు' వార్తాపత్రికలో ఆయన రాసిన సుదీర్ఘ వ్యాసంలో విగ్రహాలు, దేవాలయాలు వంటి వాటి కోసం ప్రజాధనాన్ని వృధా చేయవద్దని చాలా స్పష్టంగా చెప్పారు. గాంధీజీ 'సృజనాత్మక ప్రజాసేవ' చేయమనే చెప్పారని, విగ్రహాలు, గుళ్లు గోపురాలు కట్టి మొక్కుబడి పూజలు చేయటాన్ని వ్యతిరేకించారని పటేల్ గుర్తుచేశారు. గాంధీజీ పేరుతో అటువంటి నిర్మాణాలు చేయటం తగదని పటేల్ నిరుత్సాహపరిచారు. దానికి బదులు, గాంధీజీ ఆశయాల్ని అనుసరిస్తూ, సృజనాత్మక ప్రజాసేవ చేస్తూ ఆయన్ని మన గుండె గుడిలో నిత్య నూతనంగా నిలుపుకోవటమే నిజమైన నివాళి అన్నారు. ఇవే భావాల్ని పలు సమావేశాలలో కూడా పటేల్ వ్యక్తం చేశారు. పరిణతితో కూడిన వ్యవస్థల నిర్మాణం భారతదేశానికి ఎంత పెద్ద సవాలో, ఎంత బాధ్యతతో వ్యవహరించాలో స్వతంత్రానికి కొన్ని రోజుల ముందు కూడా పటేల్ హెచ్చరించారు. మనకు రాజకీయ సార్వభౌమాధికారం రావచ్చు, కానీ సమత, సమన్వయం, జాతీయ స్వభావం, మనం వదిలించుకోవాలనుకున్న వలస పాలకుల పాత రాజకీయ, పాలనా వ్యవస్థల స్థానంలో నూతన నిర్మాణం చేసుకోగల సత్తాను మనం సంతరించుకున్నామా అని 1947, ఏప్రిల్లో గుజరాత్‌లో మతకల్లోలు జరిగిన ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను పటేల్ ప్రశ్నించారు. దేశ ఐక్యత కోసం ప్రధాని పదవిని కూడా వదులుకున్న పటేల్, వంశపారంపర్య రాజకీయాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వలేదు. తన పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు తన పేరును వ్యక్తిగత ప్రయోజనాల కోసం కూడా వినియోగించుకోకూడదని పటేల్ నిక్కచ్చిగా చెప్పేవారు. పటేల్ ఆలోచనలు, ఆచరణతో సంబంధం లేకుండా, ప్రపంచంలోఅతిపెద్దదిగా ఉండేలా పటేల్ విగ్రహాన్ని గుజరాత్ నర్మదా ఆనకట్ట వద్ద ఏర్పాటుచేయటం, వారిని అనుకరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కూడా ఓ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని ఇంకొకరు ప్రకటించటం అధికార లాలసే తప్ప జాతి నిర్మాణం కాదు. ❍

**గాంధీజీ ఆశయాల్ని అనుసరిస్తూ, సృజనాత్మక ప్రజాసేవ చేస్తూ ఆయన్ని మన గుండె గుడిలో నిత్య నూతనంగా నిలుపుకోవటమే నిజమైన నివాళి అన్నారు.**

# పెరుగుతున్న అధికార కేంద్రీకరణ, దిగజారుతున్న రాజకీయ సంస్కృతి: జేపీ



**అధికార కేంద్రీకరణ పెరుగుతుండటం వల్ల మనదేశంలో దుష్పరిణామాలు కూడా అనివార్యంగా పెరుగుతున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "రాజకీయ సంస్కృతి దిగజారుతోంది. దిగువస్థాయిలో చిన్న అవినీతి, పైస్థాయిలో భారీ అవినీతి - ఇదే అన్ని పార్టీల ఫార్ములాగా తయారైంది. ఎన్నికల సమయంలో డబ్బులు గుమ్మరిస్తూ, ఆ తర్వాత దండుకుంటున్నారు. అసంబద్ధ పథకమో, ప్రాజెక్టో, పందేరాలో.. రూపం ఏదైనా కావచ్చు, సారంలో అవినీతి ఖాయం. రాజకీయ వ్యవస్థకు విశ్వసనీయత, నైతికత ఉండటం లేదు. కొంత మార్పునైనా మనం చూడాలనుకుంటే, అధికారాన్ని జవాబు దారీతనంతో వికేంద్రీ కరించాల్సిందే. వ్యవస్థ రాత్రికి రాత్రే మారదు. ఈ వ్యవస్థీకృత మార్పుల్ని తేవాలనుకుంటే, మనం ఏదోక అంశానికో, విభాగానికో పరిమితం కాకుండా సమగ్ర వ్యవస్థను చూడాలి" అని జేపీ అన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై జయప్రకాష్ నారాయణ్ 'న్యూస్‌మినిట్' నితిన్ బి తో మాట్లాడారు. ముఖాముఖిలోని ముఖ్యాంశాలు....**

**న్యూస్‌మినిట్: విభజన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏ స్థాయిలో ఉన్నాయి?**

జేపీ: హైదరాబాద్ వల్ల తెలంగాణ మొదట్నుంచీ మిగులు వనరు రాష్ట్రం. తొలినాళ్లలో విద్యుత్తు తదితర విషయాలపై భయాలు వ్యక్తమైనా, బండి నడిపించగలిగింది. రాష్ట్ర ప్రభుత్వం సాధించాలనుకుంటున్న స్థూల లక్ష్యం బాగానే ఉన్నా, ఆలోచనల అమలు మాత్రం అసమగ్రంగా, గందరగోళంగా ఉంది. ముందుచూపులేని తొందరపాటు ధోరణులు కూడా నష్టం కలిగిస్తున్నాయి.

గృహనిర్మాణ పథకాన్నే తీసుకుంటే, లబ్ధిదారులైన ప్రజలకు అందులో భాగస్వామ్యం లేదు. ప్రభుత్వం మొత్తం రూ.50,000 కోట్లనూ ఖజానా నుంచే పథకం కోసం వెచ్చిస్తే, కాంట్రాక్టర్ల ప్రమేయముండే దిగువస్థాయిలో ఏదోకరూపంలో అవినీతి ఖాయం. అదో పెద్ద స్కాం అవుతుంది. ఉచిత తాయిలంలా ఇచ్చే కంటే, కొంత డబ్బును ప్రభుత్వం ఇస్తూ ప్రజలనూ భాగస్వాముల్ని చేస్తే అవినీతిని నిరోధించవచ్చు. తమకు నచ్చినట్టు ఇల్లు కట్టించుకున్నామన్న సంతృప్తి కూడా లబ్ధిదారులకుంటుంది.

మరోపక్క ఆంధ్రప్రదేశ్‌ను చూస్తే, నివారించదగ్గ సమస్యలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. అసలే ఆర్థిక సమస్యల్లో ఉంటే, రైతులకు ఏమాత్రం మేలు చేయని రుణమాఫీని భారీ ఎత్తున చేయటం, ప్రభుత్వోద్యోగుల జీతాల్ని పెద్దఎత్తున పెంచటం, రాజధాని అమరావతి శంకుస్థాపన పండగ పేరుతో డబ్బు వెదజల్లటం వంటివి రాష్ట్రాన్ని మరింత కుంగదీస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం రహస్య రాజకీయాలు చేయకుండా, తాను ఎలాంటి సమాజాన్ని నిర్మించాలనుకుంటోందో స్పష్టంగా బైటపెట్టాలి. ప్రణాళికల్ని సరైన రీతిలో రూపొందించాలి. అమరావతి, పోలవరం వంటి ప్రణాళికల విషయంలో ఆర్భాటం తప్ప ప్రజాప్రయోజనాలు, దీర్ఘకాలిక దృష్టి కనిపించటం లేదు.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా వెనకబడిన జిల్లాలు ఉన్నాయి. వాటిని ఎలా అభివృద్ధి చేయాలి?**

ప్రజల్ని ప్రభువులుగా నిలపటంలో కీలకమైన స్థానిక పాలన నాకెంతో ఇష్టమైన అంశం. పంచాయతీలు సహా స్థానిక ప్రభుత్వాలకు ఎంత ఇవ్వగలిగితే అంత ఇవ్వాలి, కానీ ఆ నిధులు, అధికారాలకు జవాబుదారీగా చేయాలి. తమకు వచ్చిన నిధులలో నుంచి రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వొచ్చు. అసలేమీ జరగటం లేదు, అంతా కుళ్లిపోయింది అని ముక్కుమూసుకుని యంత్రాల్లా ఓటు వేసే ప్రజలు పాలనలో నిజమైన భాగస్వాములవుతారప్పుడు. నిధులకు స్థానిక ప్రభుత్వాలే జవాబుదారీ అయితే రాష్ట్రం మీద కూడా భారం తగ్గుతుంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏమీ జరగటంలేదనే భావన మారాలంటే

స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలి.

**తెలంగాణలో చాలామంది రాజకీయ నేతలు అధికార టీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. వీటిపై స్పీకర్ చర్య తీసుకోవాలే తప్ప తామేమీ చేయలేమని హైకోర్టు చెప్పింది. పార్టీల ఫిరాయింపుల నిరోధ చట్టాన్ని తేవటంలో ముఖ్య పాత్ర పోషించిన మీరు, ఆ చట్టాన్ని ఇంకా ఎలా బలోపేతం చేయాలని భావిస్తున్నారు?**

పార్టీలు ఫిరాయించకుండా లోపరహిత చట్టం తేవాలనుకుంటే, ఫిరాయింపుదారులపై చర్య తీసుకునే అధికారాన్ని ఎన్నికల సంఘానికి ఇవ్వండి. చట్టసభ సభ్యుడు/సభ్యురాలు పార్టీ నాయకత్వం చేతిలో పావుగా మారటమే మనదేశంలో సమస్య.

చట్టసభ సభ్యులకు సొంత గొంతు ఉండాలి, పార్టీలో అణగదొక్కుతారు లేదా పార్టీ నుంచి బహిష్కరిస్తారు అనే భయం లేకుండా తమ అభిప్రాయాలను బహిరంగపరిచే ధైర్యం ఉండాలి.

రెండోది, ఓ శాసనసభ్యుడి లేదా పార్లమెంటు సభ్యురాలి విధానపరమైన అవగాహన ఏమిటి అనే విచక్షణ లేకుండా, ఫిరాయింపుదారులనైనా సరే పార్టీలు చేర్చేసుకుంటున్నాయి. వాళ్లు కేవలం డబ్బు, అధికారం, కులాన్ని మాత్రమే చూస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోంది. మౌలిక వసతులు లేవు. రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా' కేటాయింపుపై మీ వైఖరి?**

అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. మొదటిది, పేరు. 'ప్రత్యేక హోదా' లేదా 'ప్రత్యేక ప్యాకేజీ' – కేంద్ర ప్రభుత్వం ఏదిచ్చినా అంతిమ లక్ష్యం రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలి.

ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు, నాలుగు రాయలసీమ జిల్లాలు దేశంలోని ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల కంటే కూడా వెనకబడి ఉన్నాయని అంకెలు సహా లోక్‌సత్తా పలుమార్లు స్పష్టంగా తెలియచెప్పింది. ఆ జిల్లాలకు మనం ఆర్థిక సాయాన్ని, పారిశ్రామిక పన్ను రాయితీల్ని ఇవ్వాలి. అభివృద్ధి జరగాలేగానీ, అది ఏ పేరుతో చేస్తున్నారన్నది పెద్ద అంశం కాదు.

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకర్షణీయ రంగుల కలల్ని చూపుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అగమ్యగోచరంగా ఉంది. రాజధానికి భూ సమీకరణ విధానాన్ని మీరు తప్పుపట్టారు. నాయుడు లక్ష్యాలు అవాస్తవికమైనవని మీరు భావిస్తున్నారా?**

రాజధాని విషయంలో భూ సమీకరణ పద్ధతి విపరిణామాలకు దారితీస్తుంది. ఆ పద్ధతి పరిశ్రమలకు, పట్టణీకరణకు పనికొస్తుంది తప్ప పేద రైతులకు కాదు. అమరావతికి సంబంధించి అసలు వైఫల్యం.. అనవసరంగా 33,000 ఎకరాలను సేకరించటం. ఒక రాజధానిని నిర్మించటానికి అన్ని వేల ఎకరాలు అక్కర్లా. తక్కువ భూమిని తీసుకుని జోన్‌లుగా రెగ్యులేట్ చేయటం సరైన పంథా.

**2014 ఎన్నికలలో మీరు ఓడిపోయినప్పుడు, మొదటి రెండు పార్టీలనే తప్ప మిగిలిన పార్టీలను పట్టించుకోని చాలా ప్రతికూల ఎన్నికల వ్యవస్థలో పోటీని ఎదుర్కోవలసి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఎందుకీ పరిస్థితి అని భావిస్తున్నారు? పరిష్కారంగా ఏం చేయాలి?**

మన ఎన్నికల వ్యవస్థలోనే లోపం ఉంది. ఇది కేవలం భారతదేశానికే పరిమితం కాదు. నిజానికి, మనం బ్రిటన్ నుంచి దీన్ని దిగుమతి చేసుకున్నాం. ఈ ఎన్నికల పద్ధతిలో, మూడో స్థానంలో ఉండే పార్టీని అధికారంలోకి రాగల పార్టీగా చూడరు, కేవలం సంకీర్ణానికి పనికొచ్చే పార్టీగానే పరిగణిస్తారు. ఇదో చారిత్రక ప్రమాదం. అయితే, మనకు ఈవేళ ఉన్న అక్షరజ్ఞానం, పరిణతికి ఇప్పుడున్న చెడ్డ వ్యవస్థలో చాలా నష్టదాయక ఫలితాలు వస్తాయని తెలిసినా కూడా యథాస్థితిని కొనసాగించటం మాత్రం ఆశ్చర్యకరం. సమర్థత, నిబద్ధత కలిగినవారు వేగంగా ఎదిగే అవకాశాలను కల్పించటం ప్రజాస్వామ్యం నిజమైన లక్ష్యంకాగా, మన వ్యవస్థ డబ్బు, అధికారం, వంశపారంపర్య రాజకీయాలలో కూరుకుపోయి అందుకు విరుద్ధంగా తయారైంది. ఒక్కసారి ఎన్నికయ్యాక కనీసం ఎన్నికైనవారిని వ్యవస్థ పనిచెయ్యనివ్వగలగాలి. కానీ మనం అది కూడా జరగనివ్వటం లేదు. విమర్శ అవసరం కానీ అడ్డుకోవటం తగదు.

**సుమారు 19 ఏళ్ల క్రితం లోక్‌సత్తాను ప్రారంభించినప్పటి కంటే రాజకీయ పార్టీలలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగాయని భావిస్తున్నారా?**

లోక్‌సత్తాను ప్రారంభించినప్పటికన్నా ఇప్పుడు కొన్ని విషయాల్లో పరిస్థితి అధ్వాన్నంకాగా, కొన్ని మెరుగయ్యాయి. మేం ఎప్పుడూ రాజకీయ సంస్కరణ కోసం బహుముఖ ప్రయత్నాలు చేస్తూ వున్నాం. ఎన్నికలలో అభ్యర్థులు తమ ఆస్తులు, నేరచరిత్ర వివరాలు, రాజకీయ విరాళాల్ని ప్రకటించటం తప్పనిసరి కావటం లోక్‌సత్తా కృషి వల్లే. మేం పాలనా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ)కి గట్టి మద్దతునిచ్చి సాకారమవటంలో కీలకపాత్ర పోషించాం. కానీ ఎంత చేసినా అధిగమించాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా ఉన్నాయి. ❍

# మన రాజ్యాంగం స్ఫూర్తి అత్యాధునికం, రాజకీయ వ్యవస్థ పురాతనం: జేపీ

**నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవం. రాజ్యాంగ సభ 1949లో మన రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు అది. భారతీయులమైన మేం... అని ప్రజలు రాసుకున్న రాజ్యాంగానికి కట్టుబడి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో అదే రోజుని జాతీయ న్యాయదినోత్సవంగా కూడా జరుపుకుంటున్నాం. రాజ్యాంగం విఫలమైతే అది అమలు చేసేవారి తప్పు తప్ప రాజ్యాంగానిది కాదు అని రాజ్యాంగ నిర్మాణ సారథి డా॥ అంబేద్కర్ ఆరోజు సభలో విస్పష్టంగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి జవాబుదారీతనం అక్కర్లేదంటూ, ప్రజాస్వామ్య రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా జడ్జీలను జడ్జీలే నియమించుకునే కొలీజియం విధానాన్నే కొనసాగించాలంటూ ఇటీవల ఎన్‌జేఏసీ (జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్) చట్టాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నాటి అంబేద్కర్ హెచ్చరికను రుజువు చేసే తాజా కీలక పరిణామం. చిట్టచివరి పౌరునికి కూడా సాధికారతను అందించే రాజ్యాంగ ప్రజాస్వామ్యం కోసం సుదీర్ఘకాలంగా రాజీలేని పోరాటం చేస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ మన రాజ్యాంగం అమలుతీరుపై చేసిన సమీక్ష, చూపిన దార్శనిక పరిష్కారాలు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా...**




ఒక అద్భుతమైన రాజ్యాంగం మనకుంది. అయితే దాన్ని సక్రమంగా అమలు చేసుకునే బాధ్యతలో ప్రజలు కూడా భాగస్వాములైతే తప్ప పూర్తిస్థాయిలో ఫలితాల్ని సాధించలేం. పరిపాలనంతా స్థానికంగానే జరగాలి. ప్రజలకే అధికారం బదిలీ అయితే మనదేశానికి భవిష్యత్తులో ఇక తిరుగుండదు. స్వేచ్ఛను కాపాడుకోవడం ద్వారా అభివృద్ధిని సాధించుకోవడం అనే మౌలికసూత్రాన్ని మరింత బలంగా రుజువుచేస్తూ సమాఖ్యవ్యవస్థను అభివృద్ధి చేసుకుంటూ మనం ముందుకువెళ్ళాల్సి ఉంది.

అమలు చేయడంలో ఎన్ని వైఫల్యాలున్నప్పటికీ భారత ప్రజాస్వామ్యం సాధించుకుంది చెప్పుకోదగిన విజయమనటంలో సందేహం లేదు. 5000 సంవత్సరాల చరిత్ర, భిన్న భాషలు, సాంస్కృతిక వైరుధ్యాలు, సంక్లిష్టతలు వుండి ఇంతకాలం మనగలిగిన చేవగల ఏకైక ప్రజాస్వామ్య దేశం మనదే కావడం భారతీయులు గర్వపడాల్సిన విషయం. ఆ పునాదిని కాపాడుకోవటానికి మౌలిక సంస్కరణలు చేసుకోవాల్సిన సమయమిది. సమాఖ్య వ్యవస్థలోని మూడవ అంచె పాలనకు శ్రీకారం చుట్టాల్సి ఉంది.

ఇవ్వాల్టికీ నూటికి 60మంది భవిష్యత్తు పుట్టిన నిముషంలోనే కులం కారణంగా నిర్ణయమై పోతుండడం విషాదకరం. అవినీతి విశృంఖల విహారం చేస్తోంది. నెలజీతాలు తీసుకునే ప్రభుత్వాధికారులు కొందరు వేలకోట్ల రూపాయలు సంపాదించడం చూస్తున్నాం. సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తున్నారు, వేధిస్తున్నారు, అవమానిస్తున్నారు. దోపిడీదారులు పాలనను శాసిస్తున్నారు. అలాంటి పందికొక్కుల భరతం పట్టకపోతే మన ముందుతరాలు పెద్దఎత్తున మూల్యం చెల్లించాల్సివుంటుంది.

కులం, మతం, విద్వేషాలు రగిలించడం ద్వారా కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశంలో అనైక్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. జాతికి అంతకంటే దోషం లేదు, దేశానికి అంతకంటే నష్టం లేదు, వాటికి అడ్డుకట్ట వేయాలి.





గాంధీజీ గురించి ఒక చరిత్రకారుడు అద్భుతమైన వ్యాఖ్య చేశారు. ''ఆయన భారతీయ సమాజంలో యధాతథస్థితిని కొనసాగనివ్వలేదు. అలా అని సంఘర్షణ స్థాయికీ పోనివ్వలేదు. సృజనశీలమైన ఉద్వేగస్థితికి మాత్రం తీసుకెళ్లారు''. మన రాజ్యాంగం చేసింది కూడా అదే. స్వేచ్ఛ అనే మాట మరచి వెయ్యేళ్లు దాటిపోయిన సమాజానికి ఆ స్వేచ్ఛను ఇస్తూనే, దానిని ఏకతాటిపై నిలిపింది మన రాజ్యాంగం. సమత్వం గురించి ఏనాడూ ఆలోచించని సమాజాన్ని అదే ఆశయానికి కట్టుబడి ఉండేటట్టు మలిచింది. ఫెడరల్ లక్షణం లవలేశమైనా లేని మనదేశం విజ్ఞతాయుతమైన ఒక ఫెడరల్ వ్యవస్థలో ఒదిగేటట్టు చేసినది ఈ రాజ్యాంగమే. సమాజాన్ని కలిపి ఉంచడం రాజ్యాంగం బాధ్యత. ఆ పని అది అద్భుతంగా నిర్వహించింది. మనది ఎంత వైవిధ్య, సంక్లిష్ట సమాజం! ఇక్కడ గుర్తించిన భాషలే 22 ఉన్నాయి. ఎన్ని జీవన విధానాలు! ఎన్ని సంస్కృతులు!

మన ఫెడరల్ వ్యవస్థని కాపాడటంలో రాజ్యాంగానిది గొప్ప విజయం. కొన్ని ఉదాహరణలు– కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు పునాది 275వ అధికరణమే. పదో ఫైనాన్స్ కమిషన్‌తో ఇది మరింత బలపడింది. ఇప్పుడు ఈ విభజన ప్రపంచానికి ఒక ఆదర్శంగా మారింది కూడా. రాష్ట్రపతి పాలనకు అవకాశం ఇచ్చే 356వ అధికరణాన్ని పదేపదే ఉపయోగించి మన సమాఖ్యను బలహీనపరిచినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎస్‌ఆర్ బొమ్మయ్ కేసు ద్వారా ఈ అధికరణాన్ని విచక్షణారహితంగా ప్రయోగించే ప్రమాదాన్ని అరికట్టింది మళ్లీ రాజ్యాంగమే. రాజ్యాంగానికి స్వయందిద్దుబాటు శక్తి ఉండాలి. అది ఉంది కాబట్టే ఈ మార్పు సాధ్యమైంది. అలాగే సివిల్ సర్వీసెస్, ఐఏఎస్, ఐపీఎస్‌లు రాష్ట్రానికి చెందుతారు. కానీ జాతి ఐక్యత దృష్టితో వీరి సేవలను కేంద్రం ఉపయోగించుకుంటుంది. 1960లలో తమిళనాడు విడిపోతుందనే అనుకున్నారు– భాష గొడవతో. కానీ రాజ్యాంగం ఇస్తున్న వెసులుబాటు, నాటి దేశ నాయకత్వం విజ్ఞతల వల్ల భాషా సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకున్నాం.

కెనడాలో క్యూబెక్ అనే ప్రావిన్స్ సంగతొకటుంది. మిగతా అంతటా ఆంగ్లం మాట్లాడితే ఇక్కడ మాత్రం ఫ్రెంచ్ మాట్లాడతారు. ఆ ఒక్క కారణంగానే ఆ ప్రాంతం విడిపోతుందని వాళ్లు భయపడుతున్నారు.

ఇక రాజ్యాంగంలో కొన్నిటికి సమాధానాలు లేవన్న మాట గురించి. గ్రాన్విల్ ఆస్టిన్ అనే అమెరికన్ విశ్లేషకుడు దీని గురించే ఒక మాట చెప్పారు. 'సైలెన్సెస్ ఆఫ్ కాన్‌స్టిట్యూషన్' అని. మన సుప్రీంకోర్టు కూడా చాలా సందర్భాలలో ఈ మాట అన్నది. రాజ్యాంగం చెప్పినవి ఎలాగూ ముఖ్యమే. అలాగే చెప్పకుండా ఉన్నవి కూడా అంతే ముఖ్యం. లోతులకు వెళ్లే కొలదీ దీని అందాలు అవగతమవుతుంటాయి. మౌనం నిజమే. కానీ ఆ మౌనం భావ గంభీరమైనది. ఆనాటి అయోధ్య సంక్షోభంలో సైన్యాన్ని పంపే అవకాశం ఉందా? ఏడో షెడ్యూల్‌లో 256, 355 అధికరణాలలో ఈ అంశం నిక్షిప్తంగా ఉంది, శాసనమండలి ఏర్పాటు విషయంలో కూడా ఇంతే. ఇంకా గ్రాడ్యుయేట్స్ కాన్‌స్టిట్యుయెన్సీస్ ఏమిటి? కానీ మార్చుకోవడం లేదు మనం. వేరే చట్టం చేసే వరకు దీనిని కొనసాగించవచ్చును అని మాత్రమే రాజ్యాంగం చెబుతోంది. ప్రాంతీయ సమస్యలను పరిష్కరించుకోవడం ఎలాగో రాజ్యాంగంలో ఉంది. 244 ఏ, రాజ్యాంగం అంటే అధికరణాలూ, అక్షరాలూ మాత్రమేనా? దానికో ఆత్మ ఉంది. అది పట్టుకోవాలి. కానీ రాజ్యాంగంలో లోపాలు లేవని నేను అనడం లేదు. ముమ్మాటికీ ఉన్నాయి. అది వేరే చర్చ.




విస్తరించే వలయాల మాదిరిగా అధికార వికేంద్రీకరణ జరగాలి. అదే ప్రజాస్వామ్య లక్షణం. కానీ మన రాజ్యాంగం అధికారాన్ని కేంద్రీకృతం చేసింది. పౌరుడూ, కమ్యూనిటీల కేంద్రంగా మన అధికార వికేంద్రీకరణ జరగలేదు. విచిత్రం ఏమిటంటే, రాజ్యాంగంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వం అన్న మాటే లేదు. అయినా చాలామంది జాతీయస్థాయి ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వమని పిలుస్తారు. నా మటుకు నేను ఎప్పుడూ యూనియన్ గవర్నమెంట్ అనే అంటాను. రాజ్యాంగంలో ప్రస్తావించని ప్రతి అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందని ఇక్కడ అన్నారు. అదే అమెరికాలో రాజ్యాంగంలోలేనివన్నీ రాష్ట్రాలకు చెందుతాయని అన్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది? వివిధ కారణాల వల్ల మన రాజ్యాంగం ఆత్మ అత్యాధునికం. అది నిక్షిప్తమై ఉన్న శరీరం మాత్రం పురాతనం. అందుకే 1820లలో ఎలాంటి పాలనా వ్యవస్థ అమలైందో, 21వ శతాబ్దంలో కూడా అదే కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్లు, వారికి అవే హోదాలు. అఫీషియల్స్, నాన్ అఫీషియల్స్. అసలు ఈ రెండు మాటలు మనదేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా వాడరు. కానీ ఇది రాజ్యాంగ లోపం కాదు. రాజకీయ లోపం.

అధికారం కేంద్రీకృతం కావటంతో మొదట దెబ్బతిన్నది గ్రామీణ ఆర్థిక వ్యవస్థే. రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చడం దగ్గరే కొంత గందరగోళం ఉంది. చాలా పై స్థాయిలో వచ్చిన గందరగోళం. గ్రామాలు రిపబ్లిక్‌లుగా ఉండాలన్నది గాంధీజీ ఊహ. కానీ గ్రామానికి ఎక్కువ అధికారం ఉంటే పెదధోరణులు ప్రబలుతాయన్నది అంబేద్కర్ దృష్టి. ముఖ్యంగా కుల ప్రభావం గురించి అంబేద్కర్ ఆలోచించారు. అలా 40వ అధికరణం మేరకు పంచాయతీలు ఆదేశిక సూత్రాలలో భాగంగా ఉండిపోయాయి. అధికారస్వామ్యం, ఎంఎల్ఏ రాజ్యం కలిసే సరికి ప్రజాభిప్రాయానికి దగ్గరగా ఏ నిర్ణయమూ జరగడం లేదు. వ్యవసాయ రంగానికి, వృత్తులకు న్యాయం జరగడం లేదు. దీనిని మార్చవచ్చు. ఈ రాజ్యాంగలోపం ఇలాగే ఉండిపోవడానికి కారణం మళ్లీ రాజకీయపరమైనదే.

చట్టం ముందు అంతా సమానులేనన్న విషయం రుజువవుతున్నా ఈ దేశంలో సమన్యాయం ఉందా అంటే ఉంది, లేదా అంటే లేదు. మేనకాగాంధీ కేసు తీర్పు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా ఎందరో ప్రముఖులను కోర్టుకు రప్పించడం, నిరుపేదలకీ, దళితులకీ రిజర్వేషన్లు ఇవ్వడం, కొనసాగించడం సమన్యాయ సాధనలో విజయమే. కానీ దేశంలో 60శాతం మందికి సమన్యాయం అందుబాటులో లేదు. ఇది నిజం. ఒక వ్యక్తి ఎదుగుదలకు అవకాశాలు అందుబాటులోకి తేకుండా, పనికొచ్చే విద్య అందించకుండా, సంపద సృష్టిలో భాగస్వామిని చేయకుండా, ఆరోగ్యం కల్పించకుండా సమన్యాయం రాదు. కానీ దీని సాధనలో రాజ్యాంగం పాత్ర తక్కువ. ఏ తల్లిగర్భం నుంచి జన్మించారన్న అంశం ప్రాతిపదికగా కాకుండా ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పించడమే రాజ్యాంగం ఉద్దేశం. కుల రహిత సమాజమే ధ్యేయం. కానీ కులం ఆధారంగా సమాజాన్ని ముక్కలు చేసే ప్రయత్నం

జరుగుతోంది. ఇది రాజ్యాంగం తప్పు కాదు. మనదేశంలో జరుగుతున్నది ఇదే. ఆఖరికి వామపక్ష ప్రభుత్వం ఉన్న బెంగాల్‌లో కూడా అందరికీ విద్య, ఆరోగ్యం అందలేదు. స్త్రీ విముక్తికి సంబంధించి ఆదేశిక సూత్రాలలో ప్రత్యేక ప్రస్తావన ఉంది. లింగ వివక్షకు రాజ్యాంగం అనుమతించదు. కానీ వాస్తవం వేరు. బడితె ఉన్నవాడిదే బర్రె అనే ధోరణి సమాజంలో కనిపిస్తుంది. ఇది మారకుంటే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించినా ప్రయోజనం ఉండదు. చాలాచోట్ల ఇప్పటికీ మహిళలకు ఆస్తి హక్కు లేదు. ఈ పరిస్థితి మారాలి. రాజ్యాంగ స్ఫూర్తికి అనువైన రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటనే ఇదంతా సాధ్యం. అలా కాకుంటే ఆశయం కాగితాల మీదే ఉంటుంది.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు అందరు ప్రధానులూ పాటుపడ్డారనే చెప్పాలి. అయినా నెహ్రూ అగ్రస్థానంలో నిలుస్తారని చెప్పకతప్పదు. తరువాత మొరార్జీ దేశాయ్ పేరు చెప్పాలి. ఒక ఉదాహరణ చెబుతాను. జనతా ప్రభుత్వం వచ్చిన తరువాత సుప్రీంకోర్టుకి కొత్త ప్రధాన న్యాయమూర్తిని నియమించే అవకాశం వచ్చింది. అప్పటి పరిస్థితిలో జస్టిస్ వైవి చంద్రచూడ్‌కు ఆ అవకాశం రావాలి. అయితే హెబియస్ కార్పస్ పిటిషన్ విషయంలో ఆయన ఇచ్చిన ఒక తీర్పు ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్న అభియోగం ఉంది. దానింతో చాలామంది జనతా ప్రముఖులు ఆయన నియామకాన్ని వ్యతిరేకించారు. అయినా మొరార్జీ ఆయనకే అవకాశం ఇచ్చారు. క్రమసంఖ్యలో ఉన్నవారిని, సీనియర్లను పక్కనబెట్టి ప్రభుత్వంలో ఉన్నవారి ఇష్టులను ఆ పదవిలో నియమించిన ఒకటి రెండు ఉదాహరణలు అంతకంటే కొద్దిరోజుల ముందే కనిపిస్తాయి. అయినా ఆయన నిబద్ధతతో వ్యవహరించారు. ఆఖరికి అన్ని ఆరోపణలు ఉన్న ఇందిర కార్యాలయ ఉద్యోగులను కూడా ఆయన మార్చలేదు. విపక్ష నేతకు ప్రత్యేక హోదా ఇచ్చినది ఆయనే.

భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా రాజ్యాంగ సమీక్షకు సంబంధించిన తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించింది. పీఏ సంగ్మా స్పీకరు. వారంరోజులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఉదాత్త భావాలకు ప్రతీక అని చెప్పుకోదగిన ఆ తీర్మానం చేయించారు. కానీ ఆ తీర్మానాన్ని చట్టపరంగా, రాజ్యాంగపరంగా, రాజకీయపరంగా అమలు చేసే తీరు గురించి అందులో అనుకోలేదు. అదే పెద్ద తప్పిదం. తీరా వాజ్‌పేయి హయాంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత వారు అమలు చేయడానికి చేసిన ప్రయత్నాలు అపోహలు రేపాయి. ప్రభుత్వపరంగా ఆ తీర్మానాన్ని అమలు చేయాలని ప్రయత్నించారు. నాయకత్వం బీజేపీది కాబట్టి రాజ్యాంగంలోని ఉదాత్త లౌకికభావాలు కనుమరుగైపోతాయని కొందరు అనుమానపడ్డారు. ఆ అనుమానాలు అర్థరహితం. రాజ్యాంగ సమీక్షా సంఘానికి అధ్యక్షులుగా జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్యను నియమించారు. బీపీ జీవన్‌రెడ్డి, ఫాలి నారిమన్ వంటి నిపుణులు, స్వర్గీయ సీఆర్ ఇరానీ ('స్టేట్స్‌మన్' మాజీ ఎడిటర్) కూడా సభ్యులు. కాబట్టి శంకించడం సరికాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి ఏర్పాటు చేసిన సంఘంలో జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా, నేను సభ్యులం. సమీక్ష తీర్మానం అమలుకు నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయడం మంచిదని నాటి ఉపప్రధాని ఎల్‌కె అద్వానీకి నేను సూచించాను కూడా. కానీ అదేదో సొంత పనిలాగా ఎన్డీయే ప్రభుత్వం భావించడంతో రగడ మొదలైంది. గొప్ప అవకాశం చేజారింది.

రాజ్యాంగం అమలుకు అనువైన వాతావరణం ఏర్పడాలంటే, ముందు ఎన్నికల వ్యవస్థ మారాలి. న్యాయవ్యవస్థ మారాలి. కేంద్ర, రాష్ట్ర సంబంధాల మాదిరిగానే, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల సంబంధాలు అనే మూడో అంచె ఏర్పడాలి. దామాషా పద్ధతిని అమలులోకి తేవాలి. అంటే అన్ని ఓట్లకూ విలువ ఉండాలి. స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకి ప్రత్యక్ష ఎన్నికలు జరగాలి. న్యాయమూర్తులు న్యాయవ్యవస్థకి తప్పుడు భాష్యం చెప్పి తమ నియామక అధికారాన్ని తామే తీసుకున్నారు. లేకపోతే సివిల్ సర్వీసెస్ మాదిరిగానే దీనికి ఒక కమిషన్ ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. రాష్ట్రాలకు అధికారం అప్పగిస్తే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ఈ రాజ్యాంగం ఉదాత్తం. ఆచరణాత్మకం. కాలనుకుణంగా మార్చుకునే సౌలభ్యం కలిగినది. 1955లో ఆవడి కాంగ్రెస్ ద్వారా సామ్యవాద సమాజం మనం లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. మారిన ప్రపంచ పరిస్థితులలో 1990లలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టడానికి రాజ్యాంగం అవరోధం కాలేదు. మొత్తంగా రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవాళ్లు అమాయకులైనా కావాలి, లేదా ప్రమాదరకమైన వాళ్లయినా అయివుండాలి. లోపాల సంగతి చెప్పదలిస్తే, చారిత్రక దృక్పథంతో, సహేతుకంగా వెల్లడించవచ్చు.

**(సోర్స్: గణతంత్ర వజ్రోత్సవం సందర్భంగా డా॥ గోపరాజు నారాయణరావు (సాక్షి) చేసిన ఇంటర్వ్యూ తదితరాలు)**

# కావాలిప్పుడు కాలానుగుణ మార్పు

- ప్రొఫెసర్ బి. రమేష్ బాబు
అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు

***దక్షిణాఫ్రికాలో మైనారిటీ శ్వేత జాతీయులు, మెజారిటీ నల్లజాతివారిని పాలించిన రోజుల్లో, జాతి విచక్షణను అధికార విధానంగా పాటించేవారు. దీనిమీద ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని వర్ధమాన దేశాలకు, సంపన్న శ్వేతజాతి దేశాలకు మధ్య తీవ్ర వివాదం రేగింది. జాతి విచక్షణ తన ఆంతరంగిక వ్యవహారం కాబట్టి ఐరాస జోక్యం తగదని దక్షిణాఫ్రికా శ్వేత దురహంకార ప్రభుత్వం వాదించేది. కానీ, మానవ హక్కుల రక్షణ, స్త్రీ పురుష సమానత్వం, జాతీయ స్వయం నిర్ణయాధికారానికి ఐరాస కట్టుబడి ఉందని ఇక్కడ గమనించాలి. వలస పాలన నుంచి విముక్తి కోసం ఎన్నో ఆసియా, ఆఫ్రికా దేశాలు సాగించిన పోరాటాలకూ ఈ లక్ష్యాలే ప్రాతిపదిక. అందుకే జాతి విచక్షణకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి వేదికపై వర్ధమాన దేశాలు పిడికిలి బిగించాయి. చివరకు నెల్సన్ మండేలా నాయకత్వంలో దక్షిణాఫ్రికా నల్లజాతి ప్రజలు జాతి విచక్షణను అంతం చేసి, సొంత ప్రభుత్వాన్ని స్థాపించు కోగలిగారు.***

ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఈ ఏడాది 70 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషకర సందర్భం. కాలం గడుస్తున్నకొద్దీ తమ మనుగడను సార్థకం చేసుకోవాలంటే, సంస్థలు తమను తాము సంస్కరించుకోవాలి. పునర్వ్యవస్థీకరించుకోవాలి. మానవులు నిర్మించుకున్న సంస్థలన్నీ ఆవిర్భావం, ప్రయోజనం, దుర్వినియోగాలనే మూడు దశలకు లోనవుతాయి. రెండో ప్రపంచయుద్ధానంతరం పుట్టిన ఐరాస, తరవాత ప్రపంచం ఎంతో మారినప్పటికీ, అందుకు అనుగుణంగా తన స్వరూప స్వభావాలను మార్చుకోలేదు. దీంతో ఐరాస విశ్వసనీయత, న్యాయబద్ధతలు క్రమంగా క్షీణించి, కాలం చెల్లిపోయే ప్రమాదం ఏర్పడింది. అనేక చిన్న దేశాలకు, కోట్లాది పేద ప్రజలకు ఐరాస వల్ల ప్రయోజనం ఎంతో ఉంది. కాబట్ట, ఆ సంస్థను కాలగర్భంలో కలిసిపోనివ్వకూడదు. ఐరాస భద్రతామండలి శాశ్వత సభ్యులైన అయిదు ప్రధాన దేశాలు ఐరాసను లెక్కచేయకుండా సొంత లాభం చూసుకోగలవు. కానీ బలహీన రాజ్యాలకు ఐరాస అవసరం ఎంతైనా ఉంది. ఐరాస భవిష్యత్తు గురించి, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ల గురించి చర్చించుకునే ముందు, దాని సంస్థాపన లక్ష్యాలు, సూత్రాలను ఒకసారి సమీక్షించుకోవాలి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన నానాజాతిసమితి కన్నా ఐరాస సూత్రావళి ఎంతో మెరుగైనదనటంలో సందేహం లేదు. 1945 నాటి ఐరాస ప్రాతిపదిక ఒప్పంద ప్రవేశిక శాంతి, ప్రగతులకే అగ్రాసనం వేసింది. అయితే, అగ్రరాజ్యాలైన అమెరికా, సోవియెట్ యూనియన్‌ల వైరాలు, అపనమ్మకాలు ఈ లక్ష్యాల సాధనపై నీలినీడలు ప్రసరింపచేశాయి. అప్పటి అమెరికా విదేశాంగమంత్రి కార్డెల్ హల్‌ను ఐరాస ప్రాతిపదిక ఒప్పందకర్తగా చెప్పుకోవచ్చు. అందుకే, ఆయనకు నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేశారు. ఈ ఒప్పంద ముసాయిదాకు తుదిరూపు ఇచ్చింది ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ (అమెరికా), విన్‌స్టన్ చర్చిల్ (బ్రిటన్), జోసఫ్ స్టాలిన్ (సోవియెట్)లే అయినా, 1945 శాన్‌ఫ్రాన్సిస్కో మహాసభ ఆమోదించిన తుది ప్రతి ప్రధానంగా ఆంగ్లో-అమెరికన్ సృష్టే అని చెప్పాలి.

## సమగ్ర సమీక్ష అవసరం

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా, బ్రిటన్‌లే అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రధాన పాత్ర పోషించాయి. తరవాత ప్రపంచీకరణ అంతర్జాతీయ స్థితిగతులను మార్చేసింది. కొత్త పాత్రధారుల అవతరణకు దారితీసింది. మారిన వాస్తవాలకు అనుగుణంగా ఐరాస మారక తప్పదు. ఇక్కడ ఐరాస విధులు, నిర్మాణం గురించి సింహావలోకనం చేసుకోవాలి. సర్వప్రతినిధి సభ, భద్రతామండలి, ఆర్థిక-సామాజిక మండలి (ఎకాసోక్), సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం-ఐక్యరాజ్య సమితిలో ప్రధాన విభాగాలుగా ఉన్నాయి. ఐరాస వివిధ దేశాలు స్వచ్ఛందంగా ఏర్పరుచుకున్న సంస్థ కాబట్టి, సభ్య దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ, వాటి

ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని ప్రాతిపదిక ఒప్పందం నిర్దేశించింది. దీన్ని 'ఆంతరంగిక వ్యవహారాల పరిధి' క్లాజుగా పరిగణిస్తున్నారు. కానీ, పరస్పరాశ్రిత ప్రపంచంలో స్వదేశీ, విదేశీ వ్యవహారాల మధ్య రానురానూ తేడా చెరిగిపోయి, ఈ క్లాజు తరచూ వివాదాస్పదమవుతోంది. నిజానికి ఈ క్లాజు రెండువైపులా పదునైన కత్తిలా తయారైంది. దక్షిణాఫ్రికాలో మైనారిటీ శ్వేత జాతీయులు, మెజారిటీ నల్లజాతివారిని పాలించిన రోజుల్లో, జాతి విచక్షణను అధికార విధానంగా పాటించేవారు. దీనిమీద ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని వర్థమాన దేశాలకు, సంపన్న శ్వేతజాతి దేశాలకు మధ్య తీవ్ర వివాదం రేగింది. జాతి విచక్షణ తన ఆంతరంగిక వ్యవహారం కాబట్టి ఐరాస జోక్యం తగదని దక్షిణాఫ్రికా శ్వేత దురహంకార ప్రభుత్వం వాదించేది. కానీ, మానవ హక్కుల రక్షణ, స్త్రీ పురుష సమానత్వం, జాతీయ స్వయం నిర్ణయాధికారానికి ఐరాస కట్టుబడి ఉందని ఇక్కడ గమనించాలి. వలస పాలన నుంచి విముక్తి కోసం ఎన్నో ఆసియా, ఆఫ్రికా దేశాలు సాగించిన పోరాటాలకూ ఈ లక్ష్యాలే ప్రాతిపదిక. అందుకే జాతి విచక్షణకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి వేదికపై వర్థమాన దేశాలు పిడికిలి బిగించాయి. చివరకు నెల్సన్ మండేలా నాయకత్వంలో దక్షిణాఫ్రికా నల్లజాతి ప్రజలు జాతి విచక్షణను అంతం చేసి, సొంత ప్రభుత్వాన్ని స్థాపించు కోగలిగారు.



**70వ వార్షికోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లో నీలిరంగు విద్యుత్తు కాంతులతో వెలుగులీనుతున్న ఐరాస ప్రధాన కార్యాలయం. భారత్‌లోని ఎర్రకోట సహా 60 దేశాలలోని 200 ప్రఖ్యాత కట్టడాలు కూడా ఈ సందర్భంగా నీలిరంగులో మెరిసిపోయాయి. "ప్రపంచాన్ని ఒకరోజు నీలంరంగులోకి మార్చటం ద్వారా బంగారు భవిష్యత్తుకి నాంది పలుకుదాం" అని ఐరాస ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్ పేర్కొన్నారు.**

జాతి విచక్షణను భారతదేశం బలంగా వ్యతిరేకించటం ప్రశంసనీయమే. కానీ, సొంతగడ్డపై కుల విచక్షణ గురించి ఐరాస చర్చించకుండా నిరోధించడానికి తాను కూడా స్వదేశీ పరిధి క్లాజును ఉపయోగించుకుంది. ఈ క్లాజు రెండువైపులా పదునైన కత్తిలా ఉపయోగపడుతుందనటానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? భారత్‌లో కులవ్యవస్థను చట్టపరంగా నిషేధించిన మాట నిజం. రెండో ప్రపంచ యుద్ధం ముగియడానికి ముందే ఐక్యరాజ్య సమితి స్థాపన సన్నాహాలతో పాటు, ప్రచ్ఛన్న యుద్ధానికీ బీజం పడింది. అర్థ శతాబ్దం పాటు నడిచిన ప్రచ్ఛన్న యుద్ధం అంతర్జాతీయ వ్యవస్థలో అపశ్రుతులు సృష్టించింది. రెండు అగ్ర రాజ్యాలు పోటాపోటీగా అణుబాంబులు, హైడ్రోజన్ బాంబులు, కోబాల్ట్ బాంబులు, ఖండాంతరవేది క్షిపణులను తయారుచేశాయి. అమెరికా, సోవియెట్‌లు నాలుగే నిమిషాల్లో యావత్ ప్రపంచాన్ని బూడిద కుప్పగా మార్చే సత్తా సంపాదించాయి. ప్రచ్ఛన్న యుద్ధం ఐక్యరాజ్య సమితి విధి నిర్వహణను కలుషితం చేయటం నిర్వివాదాంశం. దీనివల్ల శాంతిసుస్థిరతలకు భంగం వాటిల్లింది. ఐక్యరాజ్య సమితిలో అమెరికా, దాని మిత్రరాజ్యాలు తమ అజెండానే విధించి నానాయాగీ చేయడం, సోవియెట్ యూనియన్ 'వీటో' అస్త్రాన్ని ప్రయోగించటం పరిపాటైంది. ఆ రోజుల్లో తూర్పు ఐరోపాపై సోవియెట్ ఆధిపత్యం వలస పాలనకు తీసిపోదని ఫిలిప్పీన్స్ ప్రతినిధి ఐరాసలో

వ్యాఖ్యానించగా, సోవియెట్ అధినేత నికితా కృశ్చేవ్ పట్టరాని ఆగ్రహంతో బల్ల మీద బూటు వేసి, దబదబ బాదారు. తమ దీవులను జపాన్ దొంగిలించిందని ఇటీవల చైనా ప్రతినిధి ఆరోపించగా, జపాన్ ప్రతినిధి నిరసనాగ్రహాలతో సభ నుంచి వాకౌట్ చేయడం, అమెరికా ప్రతినిధి పరుగుపరుగున వెళ్లి ఆయన్ని శాంత పరచడానికి విఫలయత్నం చేయడం- ఈ దృశ్యాలన్నీ చూసి ప్రపంచం నివ్వెరపోయింది. ఇలాంటి రాజకీయ రసాభాసలను చూసి ఐరాస ఖాతాలో విజయాలే లేవని భావించనక్కర్లేదు. ఆకలి, అంటువ్యాధులు, పేదరికాల మీద సమితి గణనీయ విజయాలు సాధించింది. సంక్షేమ రంగంలో దాని కృషి ప్రశంసనీయం. 1945 నుంచి 170 ప్రాంతీయ సంఘర్షణలను పరిష్కరించగలిగింది. 80 దేశాలు స్వాతంత్ర్యం పొంది, సార్వభౌమ రాజ్యాలుగా నిలవడానికి సమితి తోడ్పడింది. నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం, రసాయనాస్త్రాల నిషేధం, మందుపాతరల తొలగింపు వంటి ప్రశంసనీయ విజయాలను సాధించింది. ఐరాస శాంతిరక్షక సేనల సేవలు శ్లాఘనీయం. వీటన్నింటివల్ల కొన్నేళ్ల క్రితం నోబెల్ శాంతి బహుమతిని ఐక్యరాజ్య సమితికి ప్రదానం చేశారు. మానవతా దృక్పథంతో ఐరాస పలు సేవా కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తోంది. ప్రపంచ ఆహార కార్యక్రమం కింద ఏటా 80 దేశాల్లో 11.3 కోట్ల మందికి ఆహారం అందిస్తోంది. సమితి ఆధ్వర్యంలో ఏటా 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పంపిణీ అవుతున్నాయి. శరణార్థుల సంరక్షణ, బాలల ఆలనాపాలనా, వారికి ఆహార వసతి కల్పనతో పాటు, బాలికలు, స్త్రీల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వ్యాపారాలను అరికట్టటంలో సమితి గణనీయ విజయాలు సాధించింది. ఐరాస నిర్మాణాత్మక కార్యకలాపాలన్నీ ప్రత్యేక కమిషన్లు, ఏజెన్సీల ద్వారా జరుగుతున్నాయి. వీటనింటినీ ఐరాస ఆర్థిక, సామాజిక మండలి (ఎకాసోక్) సమన్వయం చేస్తోంది.

## సంస్కరణలే సరైన దారి

సంక్షేమ కార్యక్రమాల్లో రాణింపు ప్రశంసనీయమే అయినా ఐరాస కాలానుగుణంగా తనను తాను సంస్కరించుకోకపోతే ప్రాధాన్యం కోల్పోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఐరాస భద్రతామండలి స్వరూపం మారాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. భద్రతా మండలి నిర్ణయాలు ఐరాస సభ్యదేశాలన్నింటికీ చట్టపరంగా శిరోధార్యాలు. ఇలాంటి అధికారం సమితి అనుబంధ సంస్థల్లో మరి దేనికీ లేదు. భద్రతా మండలి సంస్కరణకు ప్రతిపాదించిన పథకాల్లో రెండింటి గురించి ఇక్కడ చెప్పుకోవాలి. వీటిలో మొదటిదాన్ని జి-4 దేశాలు (భారత్, జపాన్, జర్మనీ, బ్రెజిల్) ప్రతిపాదించాయి. భద్రతామండలిలో జి-4తో పాటు రెండు ఆఫ్రికా దేశాలకూ కొత్తగా శాశ్వత సభ్యత్వం కల్పించాలని, మొత్తం సభ్యదేశాల సంఖ్యను 25కు పెంచాలని సూచించాయి. ఎన్నిక ప్రాతిపదికగా భర్తీ చేసే మూడు లేదా నాలుగు సీట్లనూ సృష్టించాలని ప్రతిపాదించాయి. రెండో పథకాన్ని ఐరాస ఏకగ్రీవ ప్రణాళికగా వ్యవహరిస్తున్నారు. కొత్త శాశ్వత సభ్యులు లేకుండా 25 మంది సభ్యులతో నూతన భద్రతా మండలిని ఏర్పరచాలని సూచించారు. అయితే ప్రతి భౌగోళిక ప్రాంతానికీ శాశ్వత సీట్లు కేటాయించి, కాలపరిమితిని సభ్యదేశాలే నిర్ణయించుకునే వెసులుబాటు ఇస్తారు. ఏ పథకం చేపట్టినా అది సముచిత ప్రాతినిధ్యం కల్పించేదిగా, అర్థవంతంగా, ప్రజాస్వామికంగా ఉండాలి. ప్రపంచ సవాళ్లను సమర్థంగా పరిష్కరించే సత్తా దానికి ఉండాలి. ప్రస్తుత భద్రతా మండలికి ఆ సామర్థ్యం లోపించిందని, ఇరాక్, సిరియా, లిబియా సంక్షోభాలు చాటుతున్నాయి. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాలు ఐదింటిలో నాలుగు భారత్‌కు సభ్యత్వం ఇవ్వడానికి సుముఖంగా ఉన్నా, చైనా మోకాలడ్డుతోంది. చైనా ఆటలు కట్టించి శాశ్వత సభ్యత్వ హోదా పొందడానికి భారత్, జపాన్, జర్మనీ, బ్రెజిల్ కలిసికట్టుగా పనిచేయాలి. ఐరాస 70వ వార్షికోత్సవం ముగిసేలోపే అనుకున్నది సాధించాలి. భద్రతా మండలితోపాటు ఐరాస సచివాలయంలోనూ సమూల మార్పులు రావాలి. సమితి ఆర్థిక, సామాజిక మండలి (ఎకాసోక్)ను ప్రపంచ పార్లమెంటు మాదిరిగా మార్చాలన్న ప్రతిపాదన వినవస్తోంది. అందులో ప్రపంచ దేశాలకు జనాభా ప్రాతిపదికన సభ్యత్వం కల్పించాలి. నేడు ప్రపంచ రాజకీయాల గరిమనాభి అమెరికా, ఐరోపాల నుంచి ఆసియా-పసిఫిక్‌కు మారుతోంది. మారుతున్న ప్రపంచానికి తగ్గట్టు తానూ మారకపోతే ఐరాస క్రమేణా కనుమరుగైపోవచ్చు. భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలు అయిదూ ఇప్పటికైనా వివేకంతో వ్యవహరిస్తాయా లేదా అన్నదానిపై సమితి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ❍

('ఈనాడు' సౌజన్యంతో)

# 'విద్యార్థి సత్తా' పునరుద్ధరణ చారిత్రక అవసరం

- పెద్దగళ్ళు రాజీవ్

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాలు నిర్వహించాల్సిన పాత్ర రోజురోజుకీ నామమాత్రంగా మారుతున్న ఈ సమయంలో చరిత్రలో మనదైన కర్తవ్యాన్ని నెరవేర్చటానికి లోక్‌సత్తా భావసారూప్యంతో కలిసి పనిచేయాలనుకునే విద్యార్థినీవిద్యార్థులు ఒక సంఘంగా బయలుదేరక తప్పదు. వామపక్షాలు సహా సాంప్రదాయ పార్టీలకు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘాలు భావజాల డొల్లతనంతో, పాత రాజకీయ సంస్కృతితో వాటి ఆవశ్యకతను కోల్పోతున్నాయి. డమ్మీలుగా మారిపోయాయి. పేరొందిన ఉస్మానియా, కాకతీయ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో నేడు విద్యార్థి సంఘాలు కులాలు, మతాలు ప్రాంతాల పేరుతో చీలికలు పేలికలుగా తయారయ్యాయి. అఖిల భారత స్థాయి విద్యార్థి సంఘాలుగా పేరుగాంచిన సంస్థలలో విశాల దృక్పథం, దూరదృష్టి లోపించడం వల్లనే నేడు కులానికో విద్యార్థి సంఘం ఆవిర్భవించింది. నిజానికి నేడు గ్రామాలలో కులసంఘాలు లేవుగానీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో మాత్రం పటిష్టంగా ఉన్నాయి. ఒక్కసారి ఆ క్యాంపస్‌లలో అడుగుపెడితే మీకే తెలుస్తుంది అక్కడున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు కులాలవారీగా ఏ విధంగా విడిపోయారనే సంగతి. ఇక్కడే కాదు హైదరాబాద్ నగరంలో ఏదైనా హాస్టల్‌లో ఉందామన్నా అక్కడా కులమే అడుగుతున్నారు. కనీసం మీకులానికి చెందిన ఎంపీ నుంచి రికమండేషన్ తెచ్చుకోగలిగే స్తోమతుంటేనే హాస్టల్‌లో అవకాశం. ఇదేమిటని ప్రశ్నించి కుల, మత, ప్రాంత. భాషలకు అతీతంగా యువతకు అండగా నిలిచే శక్తులే కరవవుతున్నాయి.




సాధారణంగా ఏ సమాజంలోనైనా ఉన్నత విద్యావంతులు, మేధావి వర్గం ఏ విధమైన మార్గంలో పయనిస్తారో మిగిలిన సమాజం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తుంది. ఒక వ్యక్తికిగానీ, కులానికిగానీ, మతానికిగానీ ఒక పరిమితి మేరకు అస్తిత్వం ఖచ్చితంగా అవసరమే. కానీ అస్తిత్వమే ప్రధానం అనుకుంటే మనం సంకుచితత్వం నుంచి బైటపడనట్టే. చిన్నచిన్న కుల విద్యార్థి సంఘాలుగా ఉంటూ కేవలం ఉనికిని ప్రదర్శించటం కోసం పనికొచ్చేవిగాకకాకుండా విశాల దృక్పథం అలవర్చుకుని విద్యార్థుల ఉమ్మడి సమస్యలను అడ్రస్ చేస్తూ ముందుకెళ్తే వచ్చే ప్రయోజనం వ్యక్తిగతం, సామాజికంగా కూడా ఎక్కువ. సామాజిక జీవితంలోకి క్రియాశీలంగా రావాలనుకుంటున్న యువతకు విద్యార్థి రాజకీయాలే తొలిమెట్టు. కావున వివేకవంతులైన, దూరదృష్టి గల విద్యార్థి ఆలోచనాపరులు ముందుకొచ్చి 'విద్యార్థి సత్తా' పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఈ సత్తాను వ్యాప్తి చేసి విద్యార్థి లోకాన్ని చైతన్యపరచాల్సిన అవసరం ఉంది.

## ఏడాదిన్నర తెరాస ప్రభుత్వం విద్యార్థులకు చేసింది శూన్యం

విద్యార్థుల త్యాగాలు, వీరోచిత పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అధికార పీఠం అధిరోహించిన తెలంగాణ రాష్ట్ర సమితి పాలన కొత్త సీసాలో పాత నీరు తరహాలో ఉంది. ప్రజాప్రతినిధులు 'నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యక్తిగత విశ్వాసాలను ప్రజల మీద రుద్దుతూ చినజీయర్ స్వామితో పాటు హెలికాప్టర్‌లో ఎక్కి యాదగిరి గుట్ట చుట్టూ తిరిగి దాని పేరును యాదాద్రిగా మార్చి రూ.100 కోట్లు కేటాయించారు. కానీ ఉస్మానియా వర్సిటీలో విద్యావ్యవస్థను బాగు చేయటానికి, విద్యార్థుల వసతి సమస్యలు తీర్చటానికి మాత్రం ఆయనకు సమయం, నిధులు లేవు.

ఉద్యమ సమయంలో కేసీఆర్ మాట్లాడుతూ, 'హైదరాబాద్

నగరంలో ఆంధ్ర పెట్టుబడిదారులు అక్రమంగా ఆక్రమించుకున్న వందలాది ఎకరాలను రాష్ట్రం రాగానే లాక్కొని తీరుతాం' అన్నారు. ఆంధ్ర, తెలంగాణ తేడా లేకుండా అలా కబ్జా చేసిన భూముల్ని లాక్కుని ఆ భూముల్లో పేదలకు ఇండ్లు కట్టించవచ్చుగా? యూనివర్సిటీ భూములెందుకు? కబ్జాలకు గురైన భూముల్లో ఒక్క ఎకరం భూమిని కూడా రికవరీ చేయలేకపోయిన ప్రభుత్వం, వర్సిటీల మీద కన్నేయటం విడ్డూరం. విశ్వవిద్యాలయాలు మానవ వనరుల నిలయాలు. భవిష్యత్తులో పరిశోధనలు పెరిగి, డిపార్ట్‌మెంట్లు విస్తరించే అవసరం రావొచ్చు. దానికోసం అదనంగా భూములు ఉంటే తప్పేంటి? పేదలకు ఇండ్లు నిర్మించడానికి యూనివర్సిటీ భూములను ఎంచుకోవడాన్ని విద్యార్థులు నిరసించి పోరాడుతుంటే, నిన్నటి ఉద్యమంలో ముందు నడిచిన మేధావులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. తాము చదివి, ఎదిగి వచ్చిన ఉస్మానియాలో మెస్ బిల్లుల కోసం, భూముల రక్షణ కోసం, ఎదిగే అవకాశాలనిచ్చే విద్య కోసం విద్యార్థుల పోరాటానికి సంఘీభావం చెప్పే మేధావులు తక్కువయ్యారు. ఉద్యమ సమయంలో మేధావులుగా పేరు తెచ్చుకున్న కొంతమంది గొంతున్నవాళ్లకి ఇవ్వాళ ఉపాధి లభించింది. కావున వాళ్లు మాట్లాడటం లేదు. పాలకవర్గంతో మమేకమై విద్యార్థి, ప్రజా ఉద్యమాలను అణచటంలో భాగస్వాములవుతున్నారు.

## నిన్నటి స్ఫూర్తి ఏదీ?


కేవలం భౌతిక తెలంగాణ కోసమే మనం పోరాడామా? తెలంగాణ విద్యార్థి లోకం ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణ బిడ్డల ఎదుగుదలకు కీలకమైన విద్య, వైద్య రంగాలు బాగుపడ్డాయా? అవినీతి పోయిందా? అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందుతున్నాయా? యువతకు ఉపాధి లభించిందా? వీటి కోసమే గదా మనం పోరాటం చేసింది! ఇవి దక్కనప్పుడు మరి ఎందుకని పోరాటాన్ని ఆపివేశాం? భౌగోళిక తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి వర్గం ఇప్పుడెందుకు చప్పుడు చేయటం లేదు? తెలంగాణ ఆవిర్భావమే కాదు, పునర్నిర్మాణంలో కూడా పాటుపడతామన్న జేఏసీలు ఇప్పుడేమయ్యాయి? కవులు, కళాకారుల సృజనాత్మక గొంతులు ఎందుకు మూగపోయాయి?

అవినీతి రాజకీయం మారకుండా రాజధాని మారినా ప్రజల బతుకులు బాగుపడవనే సత్యం పాలకవర్గానికి తెలుసు. అంతేకాకుండా, రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా బతుకుల్లో మార్పు కనపడకపోతే తెలంగాణ లాంటి ప్రాంతాల్లో ప్రజలు తిరగబడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని కూడా తెలుసు. అందుకే ఈ పాలక వర్గం చాలా తెలివిగా భావజాల ప్రచారాన్ని కూడా కట్టడిచేస్తోంది. ప్రజల జీవితాల్ని మార్చే పరిష్కారాల మీద గొంతెత్తాల్సిన కళాకారులు నేడు ప్రజల్ని శాశ్వత పేదలుగా కొనసాగించే తాత్కాలిక తాయిలాల పథకాలను ప్రచారం చేస్తున్నారు. నిజానికి తెలంగాణ కవులు, కళాకారులు తమకు ఉపాధి కల్పించండని ఎప్పుడూ పాడలేదు, ఆడలేదు. తెలంగాణలో ఉన్న లక్షలాది యువతకు ఉద్యోగాలు కావాలని పాటలు కట్టి పాడారు, ఆడారు. కానీ ఇప్పుడా వాతావరణం కనిపించడం లేదు. దాదాపు 60లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్న తెలంగాణలో కేవలం కొన్ని వేల ప్రభుత్వోద్యోగాల భర్తీ వల్ల నిరుద్యోగం తొలగదు. ఎంతమందికి ప్రభుత్వోద్యోగా లిస్తారు? మిగిలిన లక్షలాది యువతీయువకుల పరిస్థితి ఏమిటి? వీరి ఉపాధికి ప్రభుత్వేతర, వ్యవసాయేతర రంగాలలో ఆచరణాత్మక ప్రయత్నం ఏదీ? హైదరాబాద్ రావాల్సిన అవసరం లేకుండా వికేంద్రీకరించి జిల్లా పరిధిలోనే ఎదిగే అవకాశాలు కల్పించేందుకు నిర్దిష్ట చర్యలేవీ? ఈ ప్రశ్నలు వేటినీ ఆలోచనాపరులు, కళాకారులు, కవులు లేవనెత్తటం లేదు. పోటీపరీక్షలకు ప్రిపేరవుతూ అందరూ తమకే ఉద్యోగాలు రావచ్చనే ఆశలో విద్యార్థిలోకం మునిగివుండటం వల్ల ప్రస్తుతానికి సమస్యలేదన్నట్టు ప్రభుత్వం చల్తీ కా నామ్ గాడీ లాగా వ్యవహరిస్తోంది.

ఇప్పుడు తెలంగాణలో ఉన్న పాలకపక్షానికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు వెంట్రుక మందం తేడా కూడా లేదు. అవన్నీ ఒకే తానులో గుడ్డలు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం కూడా మరోమారు అదే రుజువు చేస్తోంది. రాజకీయాల్లో మౌలిక మార్పుల్ని తెచ్చి, అవినీతిని అంతమొందించే విధానాలను తీసుకురాకపోతే, నాణ్యమైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, అధికార వికేంద్రీకరణ, గ్రామాలకు–పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించటం, రైతులకు ఆదాయం, పార్టీలను ప్రజాస్వామీకరించటం వంటి ఎజెండాను అమలు చేయకపోతే, ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పూ రాదనే విషయం మళ్లీమళ్లీ రుజువవుతోంది. ఈ వాస్తవాల్ని ఎప్పటికప్పుడు తెలియచేస్తూ విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు 'విద్యార్థి సత్తా'ను పునర్నిర్మించుకోవాలి. ఇందుకు లోక్‌సత్తా నేతలు, అభిమానులతోపాటు సమాజంలో మార్పు రావాలని కోరుకుంటున్న విద్యార్థులంతా కృషి చేయాలని విజ్ఞప్తి. ❍

# తెలుగు ప్రజల నోట్లో చంద్రబాబు - మోదీల 'ప్రత్యేక మట్టి'

- కూసంపూడి శ్రీనివాస్
ఏపీ అధికార ప్రతినిధి, లోక్‌సత్తా పార్టీ



ఒకవైపు విజయదశమి పర్వదినం.. మరొకవైపు రాజధాని శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రెండు పండగలు ఒకేసారి. దాంతో యావత్ తెలుగు జాతి ఎంతో ఉత్సాహంతో, ఎంతో ఆత్రుతతో ఆ రోజు కొరకు ఎదురుచూశారు. కానీ తలచింది ఒకటి, జరిగింది మరొకటి అన్నట్టు మోదీ–చంద్రబాబు ద్వయం ప్రజల ఉత్సాహంపై నీళ్లు జల్లారు. గత నెలరోజులుగా ఆంధ్రప్రదేశ్ అధికార యంత్రాంగం హడావుడిగా కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాజధాని శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తే, కేవలం రెండే రెండు గంటల్లో మొత్తం ఆ శ్రమని, ధనాన్ని నీళ్ల పాలు చేసి అదొక మొక్కుబడి తంతుగా ముగించింది ప్రభుత్వం. మోదీ కూడా శంకుస్థాపన తంతుకి వచ్చి మొక్కుబడిగా నాలుగు మాటలు మాట్లాడి పార్లమెంటు నుంచి తెచ్చిన మట్టి, యమునా నది నుంచి తెచ్చిన నీరు చంద్రబాబు చేతిలో పెట్టి తానేమీ తీసిపోలేదు అన్నట్టు టాటా చెప్పేసి వెళ్లిపోయారు. ఈ తతంగాన్నంతా గమనిస్తున్న తెలుగు ప్రజలకి అసలు ఏమి జరుగుతోందో అర్థంకాని పరిస్థితి. రాజధానికి శంకుస్థాపన జరుగుతున్నందుకు సంతోషించాలో, ప్రత్యేక తరగతి హోదా, ప్రత్యేక ప్యాకేజీ తదితర విషయాలను కనీసం ప్రస్తావించని మోదీ వ్యవహారానికి ఏడవాలో అర్థంకాని అయోమయ స్థితిలో పడిపోయారు. రాజధాని నిర్మాణానికి అంటూ వేల ఎకరాల భూసేకరణ చేసిన విధానాన్ని ఎంతోమంది రైతులు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, శాస్త్రవేత్తలు వ్యతిరేకించినా మొండిగా చంద్రబాబు ముందుకు పోయారు. బలవంతంగా భూములు లాక్కున్నా వాటిని స్వచ్ఛందంగా రైతులు ఇచ్చారని నమ్మబలికారు. దీనికి కొంత కుల మీడియా కూడా వత్తాసు పలికింది. రాజధానికి అన్ని వేల ఎకరాలు అవసరమా అని ఎవరైనా ప్రశ్నిస్తే, వారిని రాజధాని నిర్మాణానికి వ్యతిరేకులుగా ముద్ర వేసే ప్రయత్నం చేసింది ప్రభుత్వం. జరుగుతున్నది అన్యాయం అని తెలిసినా, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అన్నిపక్షాలూ ఉన్నప్పటికీ కనీసం రాష్ట్రం విడిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి ఇస్తానన్న ప్రత్యేక తరగతి హోదా, వెనకబడిన జిల్లాలకు ఇస్తామన్న ప్యాకేజీ, విభజన బిల్లు హామీలు తదితర అంశాలలో చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో పూర్తిగా విఫలమైంది. మిత్రధర్మం పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల్ని భిక్షగా మార్చేసింది. రాజధాని శంకుస్థాపనకి ముందురోజు

ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రధానిని ఆహ్వానించాం కాబట్టి ఎక్కువగా ఆయన నుంచి ఏమీ ఆశించకూడదు అని నర్మగర్భంగా చెప్పినప్పుడే కొంత అనుమానాలు అందరిలో కలిగాయి. కానీ ఎక్కడో ఆశ. ప్రత్యేక హోదా విషయంలో ఏ ప్రకటనా చేయకపోయినా, విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కి ఎంతోకొంత ప్యాకేజీ, పరిశ్రమలకు పన్ను రాయితీలు కల్పిస్తారని అందరూ ఆశించారు. కానీ అదేమీ జరగకపోవడంతో అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. అందరిలో భవిష్యత్తుపై ఆందోళన మొదలైంది. ఇప్పటికే సింగపూర్, జపాన్ వారి చేతుల్లో రాజధాని బాధ్యతలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు నిర్మాణానికి కేంద్రంగాని సహకరించకపోతే నిధుల కోసమంటూ వారికి తెలుగు ప్రజల్ని తాకట్టు పెట్టే ప్రయత్నం కూడా జరుగుతుందనే భయాందోళనలు ప్రజల్లో మొదలయ్యాయి. కాకపోతే ఇక్కడ మనమంతా గమనించాల్సింది ఏమిటంటే, కేంద్రం ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ పట్ల చూపుతున్న వివక్షకి కారణం చంద్రబాబు తీరే అన్నది సుస్పష్టం. ప్రత్యేక హోదా కల్పించమనిగానీ, వెనకబడిన ప్రాంతాలకు పన్ను రాయితీలు ప్రకటించమని గానీ ఏనాడూ ముఖ్యమంత్రి మోదీని అడగలేదు. పైగా ప్రత్యేక హోదా సంజీవని కాదు అంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. దాంతోనే హోదా సాధించే విషయంలో చంద్రబాబు చేతులెత్తేశారని తేలిపోయింది. ఒక్క ప్రత్యేక హోదా విషయమనే కాదు, రాష్ట్రానికి లోటు బడ్జెట్ ఎంత ఉందో, మనకి ఎంతమేరకు నిధులు అవసరమో కూడా కేంద్రానికి ఖచ్చితంగా తెలియచేయడంలో ఏపీ ప్రభుత్వం విఫలమైంది. పైగా ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసినప్పుడు రాజధాని ప్రాంతానికి రాయితీలు ఇవ్వమని అడిగారు తప్ప, రాష్ట్రం మొత్తానికి ఇవ్వమని గానీ, కనీసం వెనకబడిన ప్రాంతాలకి ఇవ్వమనిగానీ అడగలేదు. దీనికన్నా దారుణం మరొకటి ఉంటుందా? పైగా అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్టే కేంద్రం మన రాష్ట్రానికి యధావిధిగా ఇచ్చే నిధులను కూడా అదేదో తాము చేసిన కృషి వల్లనే వచ్చినట్టుగా గొప్పలు చెప్పుకోవడం కూడా కేంద్రానికి చిర్రెత్తుకొచ్చింది. పోలవరం విషయంలో కేంద్రం విడుదల చేసిన నిధులకి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ సరైన లెక్కలు చూపలేకపోయింది. ఈ విషయంలో కేంద్రం చీవాట్లు కూడా పెట్టింది. దాంతో అక్కడి కాంట్రాక్టర్‌ని మార్చి పనులు వేగవంతం చేసే పనిలో పడింది రాష్ట్ర ప్రభుత్వం. ఒకపక్క చేతిలో చిల్లిగవ్వ లేక, ఉద్యోగులకి జీతాలివ్వాలంటే బాండ్లు తాకట్టు పెట్టే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. మరోపక్క ఛార్టర్డ్ విమానాల్లో విదేశీయానాలు, పుష్కరాలకి వందల కోట్ల ఖర్చు, అన్ని కార్యక్రమాలకి హంగూఆర్భాటాలతో కోట్లు వృధా చేస్తూ మేము ఆర్థిక లోటులో ఉన్నాం, సహాయం చేయండి అంటే మాత్రం ఎవరు విశ్వసిస్తారు? మొత్తానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడానికి చంద్రబాబు చేతగానితనమే కారణమనేది స్పష్టమైంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోయినా, విభజన బిల్లులోని హామీలు నెరవేరకపోయినా దానికి పూర్తి బాధ్యత చంద్రబాబే వహించాలి. ఈ విషయంలో ఏమాత్రం వెనకడుగు వేసినా మరోసారి చంద్రబాబు నాయకత్వంలోని తెదేపా ప్రభుత్వం ప్రతిపక్షం వహించకతప్పదు. ❍

('విశాలాంధ్ర' సౌజన్యంతో)

## ఎన్‌జేఏసీ బిల్లుని మళ్లీ ప్రవేశపెట్టాలి

■ **ప్రధాని, సోనియాలకు ఎంపీ వినోద్ లేఖ**

న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) బిల్లును మళ్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీ వినోద్ లేఖ రాశారు. ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు తిరస్కరించటం దురదృష్టకరమన్నారు. ఈ చట్టాన్ని 20 రాష్ట్రాలు ఆమోదించాయని, రాష్ట్రపతి కూడా 2014, డిసెంబర్ 31న ఆమోద ముద్ర వేశారని గుర్తుచేశారు. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకునే పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. దీనిపై ప్రజాభిప్రాయం సేకరించాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. ఎన్‌జేఏసీని ఆమోదించిన కాంగ్రెస్ పార్టీలోనే ఇప్పుడు భిన్న ప్రకటనలు చేస్తున్నారని, మరోసారి బిల్లును ప్రవేశపెడితే మద్దతివ్వాలని సోనియా గాంధీని కోరానని వినోద్ తెలిపారు.

# మార్కెట్ యార్డులను రైతులకు అప్పచెప్పాలి: జేపీ

## యార్డుల దుస్థితిపై నివేదికను అందించిన లోక్‌సత్తా బృందాలు



మార్కెట్ యార్డుల నిర్వహణలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా జవాబుదారీతనంతో పూర్తిగా రైతులకు అప్పగించటం, లావాదేవీల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం వంటి మార్పులతో కొనుగోళ్లు, అమ్మకాలలో పారదర్శకత పెరిగి పంటలకు మెరుగైన ధర దక్కే అవకాశముందని, రైతులు కులం, ప్రాంతం, పంట, పార్టీలకు అతీతంగా ఏకమై పోరాడితేనే ప్రభుత్వాలు వ్యవసాయ విధానాలను మార్చుకుంటాయని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ధాన్యం, పత్తి, ఉల్లి అని తేడా లేకుండా అన్ని పంటల వ్యవసాయమూ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రైతులకు ఆదాయం పెంచటంలో కీలకపాత్ర పోషించే మార్కెట్ యార్డుల్లో పరిస్థితుల అధ్యయనానికి లోక్‌సత్తా నేతలతో సెప్టెంబర్‌లో జేపీ ఏర్పాటు చేసిన నాలుగు బృందాలు తమ నివేదికను అందచేశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎంపిక చేసిన వ్యవసాయ మార్కెట్లను పరిశీలించిన బృందాలు.. అక్కడి రైతులతో, కొనుగోలుదారులతో, దళారులతో, మార్కెట్ యార్డు అధికారులు, పాలకమండళ్లతో విస్తృతంగా చర్చించాయి. బృందాల ప్రతినిధులు జేపీని కలిసి అందించిన నివేదికను పార్టీ వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

**నివేదికలోని ముఖ్యాంశాలు :**

కర్నూలు, ఎనుమాముల, రామన్నపేట, కోదాడ ఇలా వివిధ మార్కెట్ యార్డుల్లో ఉమ్మడి సమస్యలు:

1. పాలకవర్గం ఉన్నప్పటికీ నియంత్రణ లేదు
2. వేలంలో వ్యాపారులు పాల్గనటం లేదు. కొనుగోళ్లలో పారదర్శకత కొరవడింది
3. తాము పండించిన పంటను ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తరలిస్తే వచ్చే లాభాలపై రైతులకు అవగాహన లేదు. రైతులు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉల్లిగడ్డలకున్న మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పచ్చి ఉల్లిగడ్డల్ని గ్రేడింగ్ నాణ్యత లేకుండా తెస్తున్నందున సరైన ధరకు కొనుగోలు చేయటం లేదని దళారులు, వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లిగడ్డలకు కనీసం క్వింటాలుకు రూ. 800 లభిస్తే తప్ప రైతుకు న్యాయం జరగదు.
4. రైతులు చాలా సందర్భాలలో రెండుమూడు రోజులు ఉండాల్సిన పరిస్థితి. రైతులకు మరుగుదొడ్లు, భోజన, విశ్రాంతి సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయి. పారిశుద్ధ్యం పేరుతో డబ్బు ఖర్చు చూపుతున్నారుగానీ శుభ్రత మాత్రం లేదు.
5. పాలకవర్గం, ఉద్యోగులు మార్కెట్ యార్డులో కొనుగోళ్లు, అమ్మకాలని పారదర్శకంగా చేస్తే రైతులకు మెరుగైన ధర దక్కే అవకాశముంది.

నివేదికలోని అంశాలను సమీక్షించిన అనంతరం జేపీ మాట్లాడుతూ, పాలకులు ఎన్నో ఏళ్లుగా ఓటు బ్యాంకు రాజకీయాల దృష్టితో పంటల ధరల్ని కృత్రిమంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తుండటం వల్లే ఈవేళ వ్యవసాయ మార్కెటింగ్ అధ్వాన్నంగా తయారైందన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వాల నేరసమాన నిర్లక్ష్యం వల్ల రైతులే ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. పంట ఉత్పత్తికయ్యే ఖర్చుకు కనీసం 50శాతం అదనంగా మద్దతు ధర ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన పార్టీలు, అధికారంలోకి వచ్చాక కుంటి సాకులతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రైతుల ఆత్మహత్యల సమయంలోనే వ్యవసాయ సంక్షోభంపై హడావుడి చేయటం, ఆ తర్వాత యథాస్థితిని కొనసాగించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ పరిస్థితిని మార్చి, స్వేచ్ఛా మార్కెట్‌తో రైతులకు ఆదాయ భద్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేని సేవలు, నాణ్యమైన ఉచిత విద్య, ఆరోగ్యం, దేశానికి ఆహార భద్రత చేకూర్చే నూతన వ్యవసాయ విధానం కోసం లోక్‌సత్తా చేపట్టిన దీర్ఘకాల పోరాటాన్ని రైతుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సంఘటితం చేయాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు.

అధ్యయన బృందాలకు సారథ్యం వహించిన లోక్‌సత్తా పార్టీ నేతలు పి. భాస్కరరావు, బండారు రామ్మోహనరావు, సోల్కర్ రెడ్డి, సాతులూరి గోవిందరావు, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ❍

# రూ.50,000 కోట్ల స్కీము స్కాంగా మారకుండా డబుల్ బెడ్ రూం పథకంలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించండి

## జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రే సహా అన్ని ఇళ్ల పథకాలనూ ఒకే గొడుగు కిందికి తీసుకురండి

## తెలంగాణ గృహనిర్మాణ మంత్రిని కలిసి కోరిన లోక్‌సత్తా

తెలంగాణ ప్రభుత్వం రూ.50,000 కోట్లతో ప్రజల భాగస్వామ్యం లేకుండా చేపడుతున్న డబుల్ బెడ్ రూం పథకం రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, దళారీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసులు కురిపించే కార్యక్రమమవుతుందని, లబ్ధిదారుల ఎంపికను మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల్లో పెట్టటం వల్ల పేద ప్రజలకు అన్యాయం జరిగే అవకాశముందని, అందువల్ల ఇళ్ల నిర్మాణంలో ప్రజలకూ భాగస్వామ్యం కల్పించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ పట్టణ గృహనిర్మాణ నిధుల్ని మళ్లించే ప్రణాళికతో రూ.3900 కోట్ల అప్పు తెచ్చి మరీ తెలంగాణ సర్కారు ఈ పథకాన్ని చేపట్టిందని, అయితే నమూనా ఇళ్ల వరకూ బ్రహ్మాండంగా నిర్మించినా ఆ తర్వాత వేల కోట్ల పథకం కుంభకోణంగా మారటం ఖాయమని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి బంతు సాంబిరెడ్డి అన్నారు. లబ్ధిదారులైన ప్రజల భాగస్వామ్యం, పర్యవేక్షణ ఉంటేనే పథకంలో అవినీతిని సమర్థవంతగా నిరోధించగలమన్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రాజీవ్ ఆవాస్ యోజన (రే) పథకాల ద్వారా ఇప్పటికే గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ఇళ్లను కూడా డబుల్ బెడ్ రూం పథకంలో భాగంగానే గుర్తించి లబ్ధిదారులందరికీ వెంటనే కేటాయించాలన్నారు.

ఈ మేరకు సోల్కర్ రెడ్డి, సాంబిరెడ్డి సచివాలయంలో తెలంగాణ గృహనిర్మాణ శాఖామంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు.

కార్పొరేషన్ ఎన్నికలో, మరోటో కారణంగా జీహెచ్ఎంసీ పరిధిలో గత ప్రభుత్వాలు నిర్మించిన వేలాది ఇళ్లను పాడుబడేట్టు పక్కనపడేయటం తగదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎన్ని కట్టినా కాలనీకి నాలుగు రావటం కూడా అనుమానమేనని లోక్‌సత్తా నేతలు మంత్రికి వివరించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రే పథకాల కింద దరఖాస్తు చేసుకున్నవారు ప్రతి నెలా రూ.6.7 కోట్ల ఇంటి అద్దెను కడుతున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే రూ.750 కోట్ల మేర వారు నష్టపోయారని, ప్రభుత్వం బ్యాంకు రుణం వాటా కేవలం రూ.160 కోట్లను భరించి ఆ ఇళ్లను పూర్తిచేస్తే 36,000 మంది లబ్ధిదారులకు తక్షణం ప్రయోజనం నెరవేరుతుందని తెలిపారు.



"1) డబుల్ బెడ్‌రూం పథకంలో లబ్ధిదారులకూ భాగస్వామ్యం కల్పించండి. నిర్మాణంలో పర్యవేక్షణకు అవకాశమివ్వండి. అన్ని గృహనిర్మాణ పథకాలనూ ఒకే గొడుగు కిందకు తీసుకురండి.

2) జీహెచ్ఎంసీలో జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రే పథకాల కింద నిర్మించిన 52843 ఇళ్లలో ఇంకా కట్టవలసిన 10440 ఇళ్లను వెంటనే పూర్తి చేయండి. ఇళ్లు మంజూరైన 37,000 మందికి బ్యాంకు రుణం సుమారు రూ. 160 కోట్లు ప్రభుత్వమే చెల్లించాలి.

3) హైదరాబాద్‌లో 1.83 లక్షల మంది, రంగారెడ్డిలో సుమారు మరో 2లక్షల మంది ఇప్పటికే కొంత డబ్బు కట్టి పేరు నమోదు చేసుకుని సొంత ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. వెంటనే ఒక సర్వే చేసి వారిలో అర్హత గల నిజమైన పేదలకు ఇళ్లు ఇవ్వండి.

4) గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల వేలం ఆపి వాటిని పేదలకు ఇళ్లు కట్టడానికి వినియోగించండి.

5) వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం, రేలో జరిగిన అవకతవకలను బైటపెట్టి అవినీతికి పాల్పడినవారి ఆస్తులను జప్తు చేయండి" అని లోక్‌సత్తా నేతలు వినతిపత్రంలో మంత్రిని కోరారు.

తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని గృహనిర్మాణ మంత్రి హామీ ఇచ్చారని సోల్కర్ రెడ్డి, సాంబిరెడ్డి తెలిపారు. ❍

# సహ చట్టంతో గ్రేటర్ హైదరాబాద్ నిధుల దుర్వినియోగాన్ని బైటపెట్టాం: లోక్‌సత్తా

ఆర్‌టీఐ రావటంలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్, ఎంకేఎస్ తరపున అరుణా రాయ్ కీలక పాత్ర పోషించారని, ఈ చట్టాన్ని వినియోగించుకోవటంలో లోక్‌సత్తా ముందుందని చెప్పటానికి గర్వపడుతున్నామని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విభాగం ప్రధాన కార్యదర్శి బంతు సాంబిరెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీలో నిధుల దుర్వినియోగాన్ని లోక్‌సత్తా ఆర్‌టీఐ ద్వారా బైటపెట్టిందని వివరాలను తెలిపారు.

సహ చట్టంతో తో 500 కార్యాలయాల్లో సెక్షన్ 4(1)బి ప్రకారం ఆయా కార్యాలయాల సిబ్బంది విధులు, కార్యకలాపాలను వెబ్‌సైట్‌లోనూ, కార్యాలయ ఆవరణ ప్రధాన ద్వారం ముందు పెట్టించగలిగాం. గుంతలు పడుతున్న రహదారులు, నిర్మాణంలో అవకతవకలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని కోరి ప్రజల ముందుంచుతున్నాం. రహదారి నిర్మాణం అవుతున్న సమయంలోనే ఎంత మొత్తం నిధులు ఖర్చు చేస్తున్నదీ శిలాఫలకం మీద ఉండేలా విజయం సాధించాం. నగరంలోని ఒక్కో కార్పొరేటర్‌కు ఐదేళ్లలో రూ. 4.60కోట్లు చొప్పున రూ. 690 కోట్లు మంజూరవ్వగా, ఖర్చు పెట్టింది రూ. 239 కోట్లు మాత్రమేనని తేల్చగలిగాం. మిగతా నిధులు మురిగిన వైనాన్ని ప్రపంచానికి వెల్లడించాం. కార్పొరేటర్లు స్టడీ టూర్ల నిమిత్తం రూ. 3.66 కోట్లు ఖర్చు పెట్టారు. పేద ప్రజలకు బీమా సౌకర్యం కల్పించకపోగా.. ఇందుకోసం కార్పొరేటర్లకు రూ. 72 లక్షలు వెచ్చించిన వైనాన్ని వెలుగులోకి తెచ్చాం. 22 కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేసి రూ. 42 లక్షలు భోజనాలకు వెచ్చించిన వైనాన్ని వెల్లడించాం. ఫోను బిల్లులకు రూ. 1.86 కోట్లు వెచ్చించిన తీరును ప్రజల ముందుకు తెచ్చాం. ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్ల పేరు మీద రూ.కోటి, స్థానికంగా ఉన్న సమస్యలను చిత్రీకరించేందుకు హ్యాండీ కామ్‌ల పేరుతో రూ. 40 లక్షలు ఖర్చు చేశారు. స్థానికంగా కార్యాలయాలు, సౌకర్యాల కోసం రూ. 3 కోట్లు వెచ్చించిన వైనం.. ఇలా మొత్తం మీద దాదాపు రూ. 13.66 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిన తీరును బైటపెట్టాం. రూ. 5,000 కోట్ల బడ్జెట్‌ను ప్రజాప్రయోజనాలకు వినియోగించాల్సిందిపోయి, రకరకాల పేరిట దుర్వినియోగం అయిన తీరును గణాంకాలతో ప్రజల ముందుంచాం. ల్యాప్‌టాప్‌లున్నా, ఈ–మెయిళ్ల ద్వారా సమాచారం అందిస్తే సరిపోయే వీలున్నా.. కొరియర్ ద్వారా కార్పొరేటర్లకు సమాచారం అందించేందుకు రూ.ఏడు లక్షలు ఖర్చు పెట్టిన తీరును సహ దరఖాస్తులతో వచ్చిన సమాచారంతో తెలుసుకుని ఎండగట్టాం.



సమాచార హక్కు చట్టం లోగోను ప్రదర్శిస్తున్న రాము


## ఆర్‌టీఐ యువతకో అస్త్రం

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) యువత చేతిలో పాశుపత్రాస్త్రమని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. ఆర్‌టీఐకి పదేళ్లు పూర్తయిన సందర్భంగా రాము పలువురు యువకులతో కలిసి సమాచార హక్కు అనే ఆయుధానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో అవినీతి మీద నీతి గెలవాలని, మన చేతిలో ఉన్న పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం అని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ ఆయుధాన్ని ఉపయోగించి అవినీతిని అంతమొందించాలని అన్నారు. ఇప్పటికీ ఆ చట్టం మీద చాలా మందికి అవగాహన లేకపోవటం, కొంతమేర తెలిసినా ఎలా ఉపయోగించాలో అర్థం కాకపోవటం వల్ల ఇంకా అవినీతిని ప్రశ్నించలేక పోతున్నామన్నారు. అవినీతి లేని తెలంగాణ కావాలంటే, అందరికీ ఈ చట్టం మీద అవగాహన కావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి డిమాండ్ చేసి సమాచారం తీసుకునే హక్కే సహ చట్టమన్నారు. ❍

# పారిస్ శిఖరాగ్ర సదస్సులో భారత్ దృఢంగా వ్యవహరించాలి

**వాతావరణ మార్పులు**

కర్బన ఉద్గారాలపై విచక్షణారహిత ధోరణితో వాతావరణాన్ని కలుషితం చేసి భూగోళం మనుగడనే ప్రమాదంలోకి నెడుతున్న సంపన్న దేశాలు తమ తప్పిదాలను సరిదిద్దుకోవటంలో కూడా వాణిజ్య పోకడలనే ప్రదర్శిస్తున్నాయి. ఉద్గారాల తగ్గింపునకు ఇంకాఇంకా చొరవ చూపాలని భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలను సతాయిస్తుండటంతో పాటు కాలుష్య వడపోత సాంకేతిక పరిజ్ఞానం అమ్మి భారీ లాభాల్ని ఆర్జించాలని చూస్తున్నాయి. కర్బన ఉద్గారాల విషయంలో దోషులైన సంపన్న దేశాలు తమ తప్పిదాలకు భారీ పరిహారం చెల్లిస్తే తప్ప అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రత తగ్గింపు నష్టాన్ని భర్తీ చేసుకోలేవని, ఇది కేవలం వంద మిలియన్ డాలర్ల విషయం కాదని, వేల ట్రిలియన్ డాలర్ల సమస్యని భారత్ విస్పష్టంగానే పేర్కొంది. కర్బన కాలుష్య పరిమాణంలో భారత్ కూడా సంపన్న దేశాల సరసన మొదటి మూడు, నాలుగు స్థానాల్లో కనిపిస్తున్నప్పటికీ, తలసరి కాలుష్యం గణనీయంగా తక్కువని, అందువల్ల కాలుష్య దేశాలతో పోల్చకుండా ఉద్గారాల తగ్గింపు పరిహారం అందించాలని మనదేశం తెలిపింది. ఐక్యరాజ్యసమితి విధించిన గడువు అక్టోబర్ 1, 2015లోగానే బాన్ సమావేశంలో తన కార్యాచరణ ప్రణాళికను సమర్పించింది. సంపన్న దేశాల నుంచి భారీగా నిధుల్ని రాబట్టటమే ఎత్తుగడగా భారత్ వ్యవహరిస్తోందని కొందరు విమర్శిస్తున్నా, భారత్ కార్యాచరణ సాహసోపేతమైనది, ఆచరణాత్మకమైనది అని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ సౌరశక్తి ఉత్పాదనకు భారత్‌కు 1 బిలియన్ యూరోల చౌకవడ్డీ రుణాన్ని అదనంగా ఇస్తామని ప్రధాని నరేంద్రమోదీకి తెలిపారు. వాతావరణ మార్పులు, పునరుత్పాదక ఇంధనానికి సంబంధించి ఏడు రంగాలలో సహకరించుకోవాలని భారత్, జర్మనీ ఒప్పందానికి వచ్చాయి. అలాగే తాజాగా న్యూఢిల్లీలో జరిగిన




భారత్–ఆఫ్రికా శిఖరాగ్ర సదస్సులో కూడా పర్యావరణంపై స్థూల ఏకాభిప్రాయం వచ్చింది.

వేల కిలోమీటర్ల తీరప్రాంతం, రుతుపవన వ్యవసాయం ఉన్న భారత్‌కు కర్బన ప్రణాళిక ఎంతో కీలకమైనది. అందుకే వాతావరణ మార్పులపై ఈ ఏడాది చివర్లో పారిస్‌లో జరగనున్న శిఖరాగ్ర సదస్సులో ఆచితూచి వ్యవహరించాలి. పారిస్ సదస్సు ముసాయిదాలోని అంశాలపై భారత్ ఇప్పటికే తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. సంపన్న దేశాలకు అనుకూలంగా అమెరికా తయారుచేసిన ముసాయిదాలో మార్పుల్ని సాధించేందుకు, సదస్సులో ఫలితాల్ని సాధించేందుకు న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పర్యావరణాంశంపై భారత్ వాదనకు మద్దతు పలికిన 54 ఆఫ్రికా దేశాలు సహా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటినీ భారత్ కూడగట్టాలి. పారిస్ సదస్సులో భారత్ ముందుచూపుతో, మరింత దృఢంగా, స్పష్టతతో వ్యవహరిస్తేనే తన ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకోగలుగుతుంది.



**2030 నాటికి ఉద్గారాల్లో 33-35 శాతం తగ్గిస్తామని కార్యాచరణ ప్రణాళిక**


2005 నాటితో పోలిస్తే 2030 నాటికి కర్బన ఉద్గారాల తీవ్రతను 33-35శాతం మేర తగ్గించనున్నట్టు ప్రపంచదేశాలకు భారత్ హామీనిచ్చింది. అదేసమయంలో పునరుత్పాదక ఇంధనం వాటాను భారీగా 40శాతం మేర పెంచనున్నట్టు తెలిపింది. బాన్‌లో ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సంస్థ (యూఎన్‌ఎఫ్‌సీసీసీ)కి ఈమేర 'ఇంటెండెడ్ నేషనల్లీ డిటర్‌మైన్డ్ కంట్రిబ్యూషన్' (ఐఎన్‌డీసీ) పేరుతో ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించింది.

మరికొన్ని రోజుల్లో జరగనున్న పారిస్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో భారత్ ఈ చర్యను చేపట్టింది. ఈ సదస్సుకు ముందే అన్ని దేశాలూ తమ లక్ష్యాలను వెల్లడించాల్సి ఉంటుంది. ఆ శిఖరాగ్ర సమావేశంలో వాతావరణ మార్పులపై పోరుకు ఒక చరిత్రాత్మక ఒప్పందాన్ని ఖరారు చేయాల్సి ఉంది. తాము అందించింది న్యాయబద్ధమైన ప్రణాళిక అని భారత్ అభివర్ణించింది. అవసరమైతే దీనికి అదనపు జోడింపులు ఉంటాయని తెలిపింది. 'ఆర్థికాభివృద్ధి క్రమం ఇదేస్థాయిలో ఉన్నప్పుడు ఇతర దేశాలు అనుసరించిన దాని కన్నా మరింత వాతావరణ అనుకూల, స్వచ్ఛ మార్గాన పయనిస్తాం. సాంకేతిక పరిజ్ఞానాన బదిలీ, హరిత వాతావరణ నిధి సహా ఇతరత్రా అంతర్జాతీయ ఆర్థిక సాయాన్ని ఉపయోగించుకుని, స్థాపక విద్యుత్తు సామర్థ్యంలో 40 శాతం వాటాను శిలాజేతర ఇంధన వనరులతో ఉత్పత్తి చేస్తాం' అని భారత్ తన 38 పేజీల ప్రణాళికలో పేర్కొంది. ఇందులో అంశాల ప్రకారం..

- 2020 నాటికి గ్రీన్‌హౌస్ ఉద్గారాల తీవ్రతను 20-25శాతం మేర తగ్గిస్తామన్న కోపెన్‌హాగెన్ సదస్సు హామీ పునాదులపైనే తాజా ప్రణాళిక ఆవిష్కృతమవుతుంది
- అభివృద్ధి సవాళ్లను నెరవేరుస్తూనే కర్బన లక్ష్యాలను నెరవేరుస్తాం. పునరుత్పాదక ఇంధన ఆధారిత శక్తి పెరగడానికి తాజా ముసాయిదా విధానం దోహదపడుతుంది.
- పునరుత్పాదక ఇంధన సామర్థ్యానికి సంబంధించి భారత్ చేపడుతున్న విస్తరణ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమాలలో ఒకటి. వచ్చే కొన్నేళ్లలో ఈ రంగంలో 175 గిగావాట్ల సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలనుకుంటున్నాం
- సౌర విద్యుత్తు రంగంలో సహకారం కోసం మకర రేఖ, కర్కాట రేఖ మధ్య ఉన్న దేశాలతో కూడిన ఇన్‌స్పా కూటమిలో కీలక పాత్ర పోషిస్తాం. 2022 నాటికి సౌర విద్యుత్తు సామర్థ్యం 100 గిగావాట్లకు పెంచుతాం.
- పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలపై రాయితీలను తగ్గించేసి, పన్నులను పెంచాం. గడచిన ఏడాది కాలంలోనే పెట్రోలియం సబ్సిడీలో 26శాతం మేర కోత పెట్టాం. హేతుబద్ధ మొత్తంగా పరిగణిస్తున్న దాని కన్నా ఎక్కువ మొత్తాన్నే ఈ రెండు ఇంధనాలపై కర్బన పన్నుగా విధిస్తున్నాం. ఈ చర్యల వల్ల ఏడాదిలోగానే 11 మిలియన్ టన్నుల కన్నా ఎక్కువగా కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలని తగ్గించటానికి వీలవుతుంది.
- సబ్సిడీని హేతుబద్ధీకరించటానికి, దాన్ని లక్షిత వర్గాలకు అందించటానికి వంట గ్యాస్ విషయంలో నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టాం.
- 2030 నాటికి అదనంగా అడవులు, చెట్లను పెంచటం ద్వారా 2.5-3.0 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌కు సమానమైన కర్బన్‌సింక్‌ని ఏర్పాటు చేస్తాం
- వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం, అడవులు, మత్స్య, మౌలిక వసతులు, జల వనరులు తదితర రంగాలలో సర్దుబాటు చేసుకోవడానికి భారత్‌కు 2015-

30 మధ్య 25 వేల కోట్ల డాలర్లు అవసరం.

- ఉపశమన చర్యలవ్యయం మరింత ఎక్కువగా ఉండబోతోంది. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం.. ఒక మోస్తరు స్థాయి కర్బన వృద్ధిని తట్టుకోవడానికి దేశానికి 2030 నాటికి 83.4 వేల కోట్ల డాలర్లు అవసరం.
- హరిత పరిజ్ఞానాల పరిశోధన, అభివృద్ధి విషయంలో ప్రపంచస్థాయి సహకారం ఉండాలి. ❍




తలసరి కర్బన ఉద్గారాలు అధికంగా వెదజల్లుతున్న 10 దేశాలు

## మధుసూదనరావు అకాల మరణం స్థానిక సాధికారత ఉద్యమానికి లోటు - జేపీ నివాళి

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కాకుమాను పంచాయతీ సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు కొసనా మధుసూదనరావు అకాల మరణం పట్ల లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2011లో రాజకీయాల్లోకి వచ్చిన మధుసూదనరావు పార్టీలకతీతంగా లోక్‌సత్తా ప్రారంభించిన స్థానిక ప్రభుత్వాల సాధికారత సంఘంలో సభ్యులుగా ఉన్నారని, 2013లో గుంటూరు జిల్లాలో నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరై స్థానిక సాధికారత లక్ష్యాల సాధన కోసం తన వంతు బాధ్యత చేపట్టారని జేపీ గుర్తుచేసుకున్నారు. 2014లో కాకుమానుకు సర్పంచ్‌గా ఎన్నికయ్యాక, ఉన్న వనరులతోనే గ్రామంలో మౌలిక వసతుల కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించారన్నారు. స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో పూర్తిస్థాయి నిధులు, అధికారాలు ఇస్తే స్వచ్ఛభారత్ సహా అనేక కార్యక్రమాలు ఎంతలా విజయవంతమవుతాయో, ప్రజలు సాధికారతతో పాలనలో ఎలా భాగస్వాములవుతారో పరిమితుల మధ్యే ఆయన నిరూపించారని అన్నారు. మధుసూదనరావు మృతి స్థానిక సాధికారత ఉద్యమానికి లోటని నివాళులర్పిస్తూ, కుటుంబ సభ్యులకు జేపీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సూచీకి, బర్మా ప్రజలకు భారత్ అండగా నిలవాలి: జేపీ

మయన్మార్ ఎన్నికలలో ప్రజాస్వామ్య ఉద్యమకారిణి అంగ్ శాన్ సూచీ విజయం ఆమె నాయకత్వానికి, సుదీర్ఘ పోరాటానికి, త్యాగానికి దక్కిన గుర్తింపని, సైనిక పాలకులు ప్రజాతీర్పుని గౌరవిస్తారని ఆశిద్దామని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సుస్థిర ప్రజాస్వామ్యాన్ని నిర్మించటానికి బర్మా ప్రజలు ఇంకా ఎన్నో మైలురాళ్లను దాటాల్సి ఉందన్నారు. ఈ మార్పు ప్రస్థానంలో సూచీ, ఆమె ప్రజల పక్షాన భారతదేశం నిలబడాలన్నారు.

మనదేశంలో స్వేచ్ఛ, బహుళత్వం, ప్రజాస్వామ్యం అలవోకగా వచ్చేసినట్టు తేలికగా చూస్తామని, చులకనగా మాట్లాడతామని, కానీ వాటి వెనక ఎంత ప్రయాస, సుదీర్ఘ ప్రయాణం ఉంటుందో, వాటిని నిరంతర చైతన్యంతో పరిరక్షించుకోవటం ఎంత అవసరమో మయన్మార్‌ను చూస్తే అర్థమవుతుందని జేపీ అన్నారు. బీహార్ అసెంబ్లీ తీర్పు ఫెడరలిజం, బహుళత్వం సాధించిన విజయమన్నారు. రాష్ట్రంలో నితీష్ విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటూనే, జాతీయస్థాయిలో ప్రధాని మోదీ అభివృద్ధి, ఉద్యోగాలు ఎజెండా కీలకమని విస్మరించకూడదన్నారు. "మతమూఢత్వాన్ని, అహంకారాన్ని మనం తిరస్కరించాల్సిందే, కానీ స్నానం నీటితో పాటే పిల్లాడిని విసిరేయలేం. రాజకీయాలకతీతంగా అభివృద్ధి, ఉద్యోగాల మీద దృష్టి కేంద్రీకరించాల్సిన సమయమిది" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.




అనంతపురంలో జరిగిన లోక్‌సత్తా పార్టీ 9వ వార్షికోత్సవం - ప్రతినిధుల చిత్రాలు










Posting Date 22-11-2015

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on November 16th 2015




ఏళ్ల తరబడి గృహనిర్బంధంలో ఉన్నా, అణచివేతకు గురైనా విద్వేషాలకు లోనుకాకుండా, హింసా మార్గాన్ని ఆశ్రయించకుండా నెల్సన్ మండేలాలా మొక్కవోని ధైర్యంతో, బాధితుల పట్ల ఎల్లలులేని అంకితభావంతో పోరాడి తాజా ఎన్నికలలో తన పార్టీని గెలిపించిన ప్రజాస్వామ్య ఉద్యమకారిణి ఆంగ్‌సాన్ సూచీకి శుభాకాంక్షలు తెలుపుతూ ఒడిశా కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం.

| Book-Post<br>PRINTED MATTER | To, |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad